
RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 243 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | మంగళవారం, మార్చి,24, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/-
MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 243 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Tuesday, March,24, 2026 | PAGES : 8 RS : 4 /-



విద్యుత్ కేంద్రాలపై దాడి చేయాలని చూస్తే

హర్మూజ్ జలసంధిని

## శాశ్వతంగా మూసివేస్తాం..

### అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్

ఢిల్లీ,: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై ఇరాన్ అత్యంత కఠినంగా స్పందించింది. తమ దేశంలోని విద్యుత్ కేంద్రాలపై దాడి చేయాలని చూస్తే, గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ప్రతిదాడి చేస్తామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ సంచలన ప్రకటన చేసింది. కేవలం సైనిక స్థావరాలే కాకుండా, ఆయా ప్రాంతాల్లోని అమెరికా అనుబంధ ఐటీ వ్యవస్థలు, తాగునీటి శుద్ధి కేంద్రాలను కూడా ధ్వంసం చేస్తామని తీవ్రంగా హెచ్చరించింది. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిని వచ్చే 48 గంటల్లోగా తెరవకపోతే ఇరాన్ పవర్ ప్లాంట్లను నామరూపాల్లేకుండా చేస్తామని ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ జ్వాలలు రాజుకున్నాయి.



హైదరాబాద్ అభివృద్ధికి అందరూ

## సహకరించాలి

- మూసీ ప్రక్షాళనతోనే కాలుష్య నివారణ సాధ్యం - నగరంలోని పరిశ్రమలు ఓఆర్ఆర్ అవతలకు తరలింపు
- రూ.24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరణ - ఎలివేటెడ్ కారిడార్లతో అద్భుత నగరంగా హైదరాబాద్
- గుడ్ గవర్నెన్స్ కాదు... మాది స్మార్ట్ గవర్నెన్స్ - శాసనమండలిలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఎలివేటెడ్ కారిడార్లతో హైదరాబాద్ అద్భుతనగరంగా మారుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ట్రాఫిక్ రద్దీ తగ్గేలా చూస్తున్నామని చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రూపురేఖలు మార్చేందుకే క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ తీసుకొస్తున్నామని వ్యాఖ్యానించారు. కాలుష్యకారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తామని తెలిపారు. నగరంలో ఉన్న పరిశ్రమలను సిటీ బయటకు తరలిస్తే.. ఆభూములను మల్టీజోన్స్‌గా వినియోగించుకోవ చ్చని వివరించారు. మెట్రో విస్తరణకు ఎల్అండ్‌టీ ఎందుకు సహకరి ంచ లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం సూచన మేరకే మెట్రోను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రూ. 15 వేల కోట్లతో మెట్రోను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఏ రాష్ట్రంలోనైనా ఎయిర్‌పోర్టు లకు మెట్రో కనెక్టివిటీ ఉంటుందని.. కానీ తెలంగాణలో అలాంటి పరిస్థితిలేదని తెలిపారు. జూన్, జులైలోపు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పంజాగుట్ట, హైటెక్‌సిటీ, జూబ్లీహిల్స్‌లో ఎలివేటెడ్ కారిడార్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రూ. 24 వేల కోట్లతో 74 కిలోమీటర్ల మేరకు మెట్రోను విస్తరిస్తామని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బేగంపేట ఎయిర్‌పోర్టు మధ్యనుంచి అండర్‌పాస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. సిగ్నల్స్‌దగ్గర వాహనాలు ఆగకుండా వెళ్లాలనేదే తమ ఆలోచన అని చెప్పుకొచ్చారు. ఫుట్‌పా త్‌లఆక్రమణలే కొన్ని ప్రమాదాలకు కారణమని అన్నారు. చిరు వ్యాపా రులకు ఇబ్బంది ఉన్నా ఆక్రమణలు తొలగిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీ మాదిరిగా కాలుష్య నగరం కాకూడదనే హిల్ట్ పాలసీ తీసుకువ చ్చామని వివరించారు. ప్రతిపక్షాల నేతలు హిల్ట్‌పాల సీపై ఆరోపణ లు,అసత్య ప్రచారాలు చేయొద్దని హితవు పలికారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. నగరం నుంచి బయట కు వెళ్లేందుకే ఎలివేటెడ్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతోపాటు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎలివేటెడ్ కారిడార్లకు ఎక్కువ భూమి కూడా అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. గతంలో మాదిరిగా నచ్చితే నజరానా.. లేకపోతే జరిమానా విధించే విధానంఉండదని చెప్పుకొచ్చారు. గుడ్ గవర్నెన్స్ కాదని.. మాది స్మార్ట్ గవర్నెన్స్ అని వ్యాఖ్యానించారు. అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని.. ప్రతిపక్షాలు, ప్రజలుసహకరించాలని సూచించారు. ప్రతిపక్షాల నేతలు అభివృద్ధిని అడ్డుకోవాలని చూడొద్దని.. ఏవైనా సూచనలు ఉంటే ఇవ్వండి.. స్వీకరిస్తామని పేర్కొన్నారు.


బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై

## ఈటెల ఫైర్..!



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అభ్యర్థు ల ఎంపికనున రాష్ట్ర నాయకత్వం నిర్ణయించడం మానేయా లని సూచించారు. తమ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అభ్యర్థుల ను తామే బరిలోకి దించుతామని స్పష్టం చేశారు. రఘు నందన్‌రా వు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి నేను ఇప్పటికే సర్వేలు చేశాం.. మా అభ్యర్థులను మేమే నిర్ణయిస్తామని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఇటీవల డివిజన్ అధ్యక్షుల ఎంపిక కోసం వేసిన అబ్జర్వర్ల జాబితా విషయంలో తనకు ఇప్పటికీ సమాచారం ఇవ్వలే దని తెలిపారు. పార్టీ నిర్ణయాల్లో నాకు కనీసం సమాచారం అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ నేతగా తనకు ఒక గుర్తింపు ఉందని.. బీజేపీ దాన్ని కాపాడుకోవాలని ఈటల రాజేం దర్ సూచించారు. సోషల్ మీడియాలో నాపై వస్తున్న నెగెటివ్ కామెంట్స్ వెనకాల బీజేపీ పార్టీ నేతలే ఉన్నారని తెలిపారు.

అనర్హత పిటిషన్..



## దానం నాగేందర్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు తెలంగాణ హైకోర్టు నోటీసులు ఇచ్చింది. బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. దానం నాగేందర్ పార్టీ మారిన వ్యవహారంలోస్పీకర్ తీర్పును కొట్టివే యాలని ఏలేటి పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచిగెలిచిన దానం నాగేందర్..కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేశారని న్యాయ స్థానం దృష్టికి ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీసుకొ చ్చారు. ఇతర పార్టీ నుంచి నామినేషన్ వేసిన రోజు నుంచే ఆయన్ను అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా కర్ణాటక, బిహార్‌లో ఇలాంటి పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన ప్రస్తావించారు. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని దానం నాగేందర్‌తో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్, అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది.






డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా

## పార్టీలకు ప్రచారం

### కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి23 :నాలుగు అసెంబ్లీ ఎన్నికల వేళ భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు ఉచిత ప్రసార సమయం కోసం డిజిటల్ వోచర్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో మాత్రమే ఈ ఉచిత ప్రసార అవకాశం ఉంటుంది. త్వరలోఅస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ ఉచిత ప్రసార అవకాశం కల్పించింది.



ఒంటరి పోరుకే

## విజయ్ సిద్ధం..

చెన్నై,: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం ఒంటరిగా పోటీచేయాలని నిర్ణయం తీసుకుంది. మొత్తం 234 అసెంబ్లీ స్థానాల్లో ఒంటరిగా పోటీ చేయనున్నట్లు టీవీకే పార్టీ ఎన్నికల ప్రచార నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఆదవ్ అర్జున తెలిపారు. టీవీకే పార్టీ అధినేతకు పలు పార్టీల నుంచి పొత్తు కోసం ఆఫర్లు వచ్చినా, దళపతి వాటిని సున్నితంగా తిరస్కరించారని పేర్కొన్నారు. ఢిల్లీ నేతలకు సలాం కొట్టడం ఇష్టం లేక, సొంత అజెండా ఉండటం ముఖ్యమని భావించినట్లు చెప్పుకొచ్చారు.దేశ వ్యాప్తుంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23న జరగనున్నాయి. ఇదివరకే ఈసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. మే 4న ఓట్లు లెక్కించి, ఫలితాలు ప్రకటించనుంది. సాధారణంగా గత కొన్ని దశాబ్దాలుగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడిఎంకె నేతృత్వంలోని కూటములు, నామ్ తమిళర్ పార్టీ ఒంటరిగా పోటీ చేసేవి. అయితే ఈసారి నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ౹ఎఐ పార్టీ రేసులోకి రావడం రాజకీయ ముఖచిత్రాన్నే మార్చేసింది. అందు లోనూ ఏ పార్టీతో పొత్తు లేకుండా టీవీకే సొంత ంగా పోటీ చేయనుండటం తమిళ ప్రజలతో పాటు దక్షిణాదిని ఆకర్షిస్తోంది.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గుడ్ న్యూస్

## ఇక ప్రతి వారం బిల్లులు..

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో పేదల సొంతింటి కలను నెరవేర్చే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క మల్లు శుభవార్త అందించారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి బిల్లులను ఇకపై ప్రతీ వారం మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ నిర్ణయంతో నిర్మాణ పనుల్లో జాప్యం తొలగిపో యి, ఇళ్ల నిర్మాణం వేగవంతం కానుందని లబ్ధిదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మీడియాతో మాట్లాడిన భట్టి విక్రమార్క... ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వీలైనంత త్వరగా తమ ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. బిల్లుల చెల్లింపు బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని, ప్రతి వారం నిధులు విడుదల య్యేలా చూస్తామని భరోసా ఇచ్చారు. గతంలో ఈ పథకం ప్రారంభమైనప్పుడువారానికోసారి బిల్లులు ఇచ్చినా, ఆ తర్వాత ఆర్థిక కారణాలతో నిలిచిపోయిన విషయాన్ని గుర్తుచేసుకు న్నారు. ఇప్పుడు ఆ ప్రక్రియను పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించా రు. రాష్ట్రంలో ఏ ఒక్క పేద కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘా టించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బడ్జెట్‌పై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న విమర్శలను భట్టి విక్రమార్క తిప్పికొట్టారు.

# అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో బిజెపి నేతల అరెస్టులు









**ఏఎస్ రావునగర్, మార్చి 23, (తెలంగాణ దిశ)** :రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలన కొనసాగుతుందని ఆరోపిస్తూ బిజెపి ఇచ్చిన అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో పోలీసులు పలు ప్రాంతాల్లో ముందస్తు అరెస్టులకు దిగారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆదేశాల మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనకుండా ఏఎస్ రావునగర్ డివిజన్‌కు చెందిన నాయకులను పోలీసులు ప్రివెంటివ్ అరెస్ట్ చేసారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరికి నిరసన కార్యక్రమానికి పిలుపు నిచ్చినట్లు బీజేపీ నేతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా పబ్లిక్ గార్డెన్ దగ్గర బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి అంబటి వెంకటాచలం,డివిజన్ అధ్యక్షురాలు తుమ్మల సంధ్యా నర్సిరెడ్డి, డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దూరి సంపత్ రావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఉమా శ్రీధర్ అరెస్ట్ చేసారు. అనంతరం సిద్దూరి సంపత్ రావు, శ్రీధర్ లను అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ కు, సంధ్యా నర్సిరెడ్డిని నాంపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా బిజెవైఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మాజీ అధ్యక్షులు కనుకుల రజనీకాంత్ రెడ్డి, రైల్వే ఎస్ సిసి సభ్యుడు ఎం. లక్ష్మణ్ గౌడ్ తదితరులను కుషాయిగూడ, జవహర్ నగర్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అదే విధంగా పలువురు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషనులకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తున్న నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్ట్ చేయడం అన్యాయమని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న బీజేపీ నాయకులను అణచివేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కూడా ఇలాగే వ్యవహరించిందని, అప్పట్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అనుసరిస్తుందని విమర్శించారు. ప్రజలు తగిన సమయంలో స్పందిస్తారని హెచ్చరించారు.

## డ్రైవింగ్ లైసెన్స్ పై స్పెషల్ డ్రైవ్

**హైదరాబాద్, (తెలంగాణ దిశ) :** హైదరాబాద్ వాహనదారులకు అలర్ట్. నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులుమరో కీలకనిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి సరైన డ్రైవింగ్ లైసెన్స్ లేకుం డా వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. మార్చినుం డి నిరంతరాయంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చర్యలు తీసుకుంటామని సిటీ పోలీసులు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం లైసెన్స్ లేని డ్రైవర్ల వల్లే జరుగుతున్నాయని తాజాగా నగర ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో.. వాహనదారులు తప్పనిసరిగా ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలని సూచిస్తున్నారు. లైసెన్స్ లేని వారు వెంటనే సంబంధిత ఆర్టీఏ ఆఫీసు నుంచి దానిని పొందాలని కోరుతున్నారు.కేవలం వాహనం రోడ్లపై నడిపేవారే కాకుండా.. లైసెన్స్ లేని వ్యక్తులకు తమ వాహనాలను ఇచ్చే యజమా నులపై కూడా ఇక నుంచి చట్టపరమైన చర్యలుతీసుకోనున్నట్లు పోలీసు లు వెల్లడించారు. నిబంధనల ప్రకారం.. వాహనం నడిపే అర్హత లేని వారికి వాహనాలు ఇవ్వడం నేరమని చెబుతున్నారు. దీనివల్ల భారీ జరిమానాలతో పాటుగా ఇతర చట్టపరమైన ఇబ్బందులు సైతం ఎదుర్కోవాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతూ ప్రమాదానికి గురైతే.. సదరు వాహనానికి ఇన్సూరెన్స్ క్లెయిమ్ వర్తించదని అంటున్నారు. దీనివల్ల బాధితులకు లేదావాహన యజమానులకు తీవ్రమైన ఆర్థిక భారంతో పాటు చట్టపరమైన చిక్కులు ఎదురవుతాయని చెబుతున్నారు.

# అంబేద్కర్, పూలే ఆశయాల సాధనే వారికి మనమిచ్చే ఘన నివాళులు






**కీసర, మార్చి 22, (తెలంగాణ దిశ)** :భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వారు చూపిన మార్గంలో మనందరం నడవడమే వారికి మనం ఇచ్చే గొప్ప నివాళి అని ఈసీఐఎల్ బిఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చింతలపూడి సుధీర్, మహిళా సహాయ కార్యదర్శి కేతావత్ శారదా భాయిలు అన్నారు. ఆదివారం కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీ లో మాల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బాబాసాహెబ్ అంబేద్కర్ 211వ, మహాత్మా జ్యోతిరావు పూలే 11వ జ్ఞాన మాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహనీయుల విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ రూపకర్తగానే కాక ఆయన గురువు అయిన మహాత్మా జ్యోతిరావు పూలే కలలు కన్న ఆశయాలను సమాజంలో సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ స్థాపన కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన కలలు కన్న భారత దేశాన్ని నిర్మించడానికి యువత ముందుకు రావాలి. విద్య, సామాజిక న్యాయం, చైతన్యం, హక్కుల పరిరక్షణ..., ఇవి అంబేద్కర్ చూపిన మార్గాలు. వాటిని ఆచరణలో పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈసీఐఎల్ బిఎంఎస్ యూనియన్ సభ్యులు యోగేష్, ఆర్ జి కె కాలనీ మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాట రాజు, గౌరవ అధ్యక్షుడు తాడేపల్లి అబ్బులు, సలహాదారులు మోతే రాజేంద్ర ప్రసాద్, మాజీ అధ్యక్షురాలు పాడుగుల రూప చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి సానాది సాయిబాబ, కోశాధికారి చెన్నయ్య, కార్య నిర్వాహక అధ్యక్షుడు కోలాటి రాజు, మాల సంఘం సభ్యులు తగిలి రాధాకృష్ణ, పోతుల వెంకటేశ్వర రావు, అప్పారావు, అనిల్,వినాయక రావ్, గ్యాస్ వెంకటేష్, బత్తుల శ్రీనివాస్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# సర్వే నెంబర్ 295లో ప్రభుత్వ భూమిలో అక్రమ షెడ్డు నిర్మాణం

## - టౌన్ ప్లానింగ్, మండల రెవెన్యూ అధికారులకు సమాచార లోపమా..?

## - చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్న రెండు శాఖల అధికారులు


U. SHOWCAUSE NOTICE

MALKAJGIRI MUNICIPAL CORPORATION
Office of the Dy. Commissioner
Keesara Circle-01, MMC, Hyderabad.

Notice No: G1/TPS/28/MMC/2026/ Date:17.03.2026

SHOW CAUSE NOTICE

Sub:- GHMC –Keesara Circle - TPS – Carrying out the Unauthorized Construction without obtaining necessary permission from concerned authority at Sy No. 295, Jawahar Nagar, Under Keesara Circle, Malkajgiri Zone-Show cause notice under the provisions of GHMC Act1955 read with Sec.10 of TS-bPASS Act 2020 -Issued-Regarding.

***

Whereas, it has come to the notice of the undersigned that you have commenced construction without obtaining necessary permission from concerned authority at Sy. No. 295, Jawahar Nagar, Under Keesara Circle, Malkajgiri Zone which is contrary to the provisions of GHMC Act 1955 and Bye-Laws made there under read with TS-bPASS Act 2020.

Photo of the Existing Building

GPS Map Camera
Hyderabad, Telangana, India
19/790, Jwahar Nagar, Ambedkar Nagar, Hyderabad, Telangana 500087, India
Lat 17.516332° Long 78.582143°
Saturday, 28/0[illegible]2026 11:52 AM GMT +05:30
Google

Therefore, you are hereby directed to show sufficient cause by a statement in writing within (7) days from the date of receipt of this notice as to why the above un-authorized construction shall not be demolished departmentally.

Failing which, it will be construed that you have no explanation to offer and further action will be taken as per Rules in force.

Deputy Commissioner,
Keesara Circle-01,
MMC, Hyderabad.

To,

Sri/Smt. Owner/Occupier
Sy. No. 295, Jawahar Nagar,
Keesara Circle-01, Malkajgiri Zone,
MMC, Hyd.



**జవహర్ నగర్, మార్చి 23, (తెలంగాణ దిశ)** :కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నగర్ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సర్వే నెంబర్ 295 ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వాణిజ్య షెడ్డు నిర్మాణం జరుగుతుం డటంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జవహర్ నగర్‌లోని శ్రీశ్రీ జ్ఞాన్ మందిర్ హైస్కూల్ పరిధి, వైయస్సార్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై ఈ నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎంఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు కాప్రా మండల రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టీపీఓ, రెవెన్యూ విభాగాలతో పాటు కాప్రా రెవిన్యూ అధికారులు స్పందించకపోవడంతో అక్రమార్కులకు ప్రోత్సాహం కల్పిస్తున్నరనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. రెండు ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ లోపం కారణంగా చర్యలు తీసుకోవడంలో ఆలస్యం జరుగుతుందని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే భూముల్లో ఇలాంటి అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# శ్రీరాంనగర్ 2బిహెచ్‌కే సమస్యలు పరిష్కరించాలి

## - ప్రజావాణిలో కలెక్టర్‌కు లబ్ధిదారుల వినతి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 23, (తెలంగాణ దిశ)** :కప్రా సర్కిల్ పరిధిలోని శ్రీరాం నగర్ 2బిహెచ్‌కే కాలనీలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రం అందజేసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాములు నాయక్, రవీందర్, గౌస్, షఫీ మాట్లాడుతూ కాలనీలోని వాణిజ్య సముదాయాలను వేలం వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. వాటిని కిరాయికి ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయాన్ని మెయింటెనెన్స్ ఖర్చులకు వినియోగిస్తే లబ్ధిదారులపై భారం తగ్గుతుందని సూచించారు. కాలనీలో కనీస సౌకర్యాల లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. జీరో కరెంట్ బిల్లు అమలు చేయాలని, బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని, 117 నంబర్ బస్సును శ్రీరాం నగర్ 2బిహెచ్‌కే వరకు పొడిగించాలని కోరారు. అదే విధంగా భవనాల స్లాబులు ఊడిపోవడం, పెచ్చులు రాలడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని, నీటి లీకేజీలను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. లిఫ్ట్‌ల ఏఎంసీలను పొడిగించి, పనిచేయని లిఫ్ట్‌లను త్వరగా మరమ్మతు చేయాలని కోరారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని, వీధి దీపాలకు కేబుల్స్ వేయాలని విజ్ఞప్తి చేశారు. సెల్లార్‌లో నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేశారు. లబ్ధిదారుల సమస్యలపై కలెక్టర్ మను చౌదరి వెంటనే స్పందించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 2బిహెచ్‌కే లబ్ధిదారులు బాబురావు, కిషన్, సతీష్, సైదులు, యాదగిరి, రాజిరెడ్డి, ఇస్మాయిల్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోసమే బస్తీబాట



## - కాంగ్రెస్ నేత నెమిలి అనిల్ కుమార్

**మల్లాపూర్, మార్చి 23, (తెలంగాణ దిశ)** :మల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ భవాని నగర్‌లో సోమవారం "బస్తీ బాట" కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ కాలనీలో పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలను కలుసుకుని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి ప్రాథమిక సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని నెమలి అనిల్ కుమార్ హామీ ఇచ్చారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా శాశ్వత పరిష్కారాలు అందించడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. బస్తీల అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# కాప్రా సర్కిల్‌లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి







**కాప్రా, మార్చి 23, (తెలంగాణ దిశ)** :ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక– –99 రోజుల కార్యక్రమంలో భాగంగా కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ఆధ్వర్యంలో సోమవారం విస్తృత పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా కాప్రా సర్కిల్ పరిధిలోని ట్రాన్స్ ఫార్మర్ల వద్ద పారిశుధ్య సిబ్బంది పరిసరాలను శుభ్ర పరిచారు. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం, రాళ్లు, మట్టి తొలగించి ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టారు. స్థానికుల సూచనల మేరకు ట్రాన్స్ ఫార్మర్ల వద్ద పిచ్చి మొక్కలు పెరగడం వల్ల అగ్ని ప్రమాదాల అవకాశాలు ఉన్నాయని గుర్తించి శుభ్ర పరిచినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. అలాగే ఎలక్ట్రికల్ విభాగంతో సమన్వయం చేసి ట్రాన్స్ ఫార్మర్ల చుట్టూ భద్రతా ఏర్పాట్లు చేయించి షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దీనివల్ల మనుషులు, జంతువులకు ప్రాణహాని జరగదన్నారు. అదే విధంగా జమ్మిగడ్డ ప్రాంతంలో రోడ్ల పక్కన పడేసిన పాత సోఫా సెట్లు, మంచాలు, కుర్చీలు, గ్లాసులు వంటి నిరూపయోగ వస్తువులను తొలగించి వాహనాల్లో తరలించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ విభాగం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డీఈ రవి, సానిటరీ సూపర్ వైజర్ సుదర్శన్, జవాన్ రాజన్, ఎస్ఎఫ్ఏ అరవింద్, శానిటేషన్ సిబ్బంది, ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ఇళ్లలోని నిరుపయోగ వస్తువులను రోడ్లపై, కాలువల్లో లేదా ఖాళీ ప్రదేశాల్లో పడవేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందించాలని కోరారు. ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం కోసం అందరూ సహకరించాలని పిలుపు నిచ్చారు. స్వచ్ఛ ఆటోలు ద్వారా ఇంటింటి చెత్త సేకరణను కచ్చితంగా నిర్వహించాలని, ప్రతి ఇంటి నుండి రోజూ చెత్త సేకరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. చెత్తను నిర్లక్ష్యంగా వేయకుండా ప్రజలను ప్రేరేపించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. అదే విధంగా శ్రీరామ నవమి సందర్భంగా కందిగూడ సీతారామచంద్రస్వామి దేవాలయం వద్ద పారిశుధ్య పర్యవేక్షణ నిర్వహించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

# సంపాదకీయం

## డాలర్‌ను సవాలు చేస్తే అంతేనా..?

వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను బంధించి సంకెళ్లతో తీసుకెళ్లడం చూస్తుంటే సరిగ్గా 22–23 ఏళ్ళ క్రితం ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుసేన్‌పై దాడి చేసి, ఆ తర్వాత ఉరితీసిన అమెరికా దుశ్చర్య గుర్తుకు వస్తుంది. సద్దాం జీవాయుధాలు తయారు చేస్తున్నాడనే ఆరోపణతో యుద్ధానికి దిగిన అమెరికా అందుకు ఎటువంటి ఆనవాళ్లను ఇప్పటివరకు చూపలేకపోయింది. ఇప్పుడు కూడా అమెరికా వెనెజువెలాపై దాడిచేయడానికి అసలు కారణం 1974లో సౌదీఅరేబియాతో హెన్రీ కిస్సింజర్ చేసుకున్న ఒప్పందం. ఇది వాస్తవానికి అమెరికా డాలర్ మనుగడ గురించి అని మాత్రం స్పష్టం అవుతుంది. ట్రంప్ చెబుతున్నట్లు మాదకద్రవ్యాలు, ఉగ్రవాదం, ప్రజాస్వామ్యం వంటి కారణాలు ఏవీకావు. ఇది 50 సంవత్సరాలుగా అమెరికాను ఆధిపత్య ఆర్థికశక్తిగా ఉంచిన పెట్రోడాలర్ వ్యవస్థను కాపాడుకోవడం కోసమే అని గ్రహించాలి. వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్జ్‌ను కూడా తమ మాట వినకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం గమనార్హం. అమెరికా బెదిరించి, బలప్రయోగం చేసి డాలర్లతో అంతర్జాతీయ వాణిజ్యం జరిగేటట్లు చూస్తూ ప్రపంచంలో సంపన్న దేశంగా చెలామణి అవుతుంది. ఎప్పుడైతే యూరోలో చమురు వాణిజ్యం చేస్తానని సద్దాం ప్రకటించారో తన ఆర్థిక వ్యవస్థ కూలిపోతుందని అమెరికా భయపడింది. ఇపుడు కూడా మదురో ఇతర కరెన్సీలలో చమురు వాణిజ్యం చేయడం ప్రారంభించింది అమెరికా భయపడిపోయింది. అందుకనే వెనిజులాను అంతం చేస్తామని ట్రంప్ బెదిరించారు.వెనిజులాలో 303 బిలియన్ బారెల్స్ నిరూపితమైన చమురు నిల్వలు ఉన్నాయి. సౌదీ అరేబియా కంటే ఎక్కువ. మొత్తం ప్రపంచ చమురులో 20 శాతం. వెనెజువెలా ఆ చమురును చైనీస్ యువాన్‌లో చురుకుగా అమ్ముతోంది. డాలర్లలో కాదు. 2018లో వెనెజువెలా డాలర్ నుండి విముక్తి పొందుతామని ప్రకటించింది. వారు యువాన్, యూరోలు, రూబిళ్లు, చమురుకు డాలర్లు తప్ప మరేదైనా అంగీకరించడం ప్రారంభించారు. పైగా, బ్రిక్స్‌లో సభ్యతం కోసం దరఖాస్తుకు సిద్ధమయ్యారు. స్విఫ్ట్‌ను పూర్తిగా దాటవేస్తూ చైనాతో ప్రత్యక్ష చెల్లింపు మార్గాలను నిర్మిస్తున్నారు. వారు దశాబ్దాలుగా డాలర్ ఆధిపత్యం తొలగించేందుకు అవసరమైన నిధులు సమకూర్చడానికి తగినంత చమురు నిల్వలు వారి వద్ద ఉన్నాయి. మొత్తం అమెరికన్ ఆర్థిక వ్యవస్థ పెట్రోడాలర్ పై నిర్మించారని గుర్తించాలి. చమురు వ్యాపారం డాలర్లతో జరగకపోతే అమెరికా ఆర్థిక వ్యవస్థ కూలిపోతుంది. అందుకనే, 1974లో, హెన్రీ కిస్సింజర్ సౌదీ అరేబియాతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా అమ్ముడైన అన్ని చమురు ధరలను అమెరికా డాలర్లలో నిర్ణయించే విధంగా అవగాహనకు వచ్చారు. అందుకు బదులుగా, అమెరికా ఆ దేశానికి సైనిక రక్షణను అందిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా డాలర్లకు కృత్రిమ డిమాండ్‌ను సృష్టించింది. భూమిపై ఉన్న ప్రతి దేశానికి చమురు కొనడానికి డాలర్లు అవసరం. ఇది అమెరికా అపరిమిత డబ్బును ముద్రించడానికి అనుమతిస్తుంది. ఆ నిధులతోనే సైన్యానికి నిధులు సమకూరుస్తుంది. సంక్షేమ రాజ్యం. లోటు వ్యయం. పెట్రోడాలర్ సైనిక విమానాలకంటే అమెరికా ఆధిపత్యానికి చాలా ముఖ్యంగా మారింది. అందుకనే దానిని సవాలు చేసే నేతలను అమెరికా సహింపలేదు. 2000లో సద్దాం హుస్సేన్ ఇరాక్ డాలర్లకు బదులుగా యూరోలలో చమురును విక్రయిస్తుందని ప్రకటించాడు. 2003 నాటికి అమెరికా ఆ దేశాన్ని ఆక్రమించుకుంది.ఇరాక్ చమురు వెంటనే డాలర్లకు తిరిగి మారింది. సద్దాంను కొట్టి చంపారు. 2009లో చమురు వ్యాపారం కోసం గడాఫీ గోల్ దినార్ అని పిలువబడే బంగారు మద్దతుగల ఆఫ్రికన్ కరెన్సీని ప్రతిపాదించాడు. హిల్లరీ క్లింటన్ స్వయంగా లీక్ అయిన ఇ మెయిల్‌లు జోక్యానికి ఇది ప్రధాన కారణమని నిర్ధారిస్తాయి. ఇ మెయిల్‌లో ఈ బంగారం లిబియా బంగారు దినార్ ఆధారంగా పాన్ –ఆఫ్రికన్ కరెన్సీని స్థాపించడానికి ఉద్దేశించబడింది. 2011లో నాటో లిబియాపై బాంబులు వేసింది. గడాఫీని లైంగికంగా హింసించి హత్యచేశారు. లిబియాలో ఇప్పుడు బానిసమార్కెట్లు తెరిచిఉన్నాయి.మేము వచ్చాము, మేము చూశాము, అతను చనిపోయాడు! క్లింటన్ కెమెరా ముందు నవ్వాడు. బంగారు దినార్ అతనితోపాటు మరణించింది. ఇప్పుడు మదురో. సద్దాం, గడాఫీలు ఇద్దరి వద్ద కంటే ఐదురెట్లు ఎక్కువ చమురుతో యువాన్‌లో చురుకుగా అమ్ముతున్నారు. డాలర్ నియంత్రణ వెలుపల చెల్లింపు వ్యవస్థలను నిర్మించడంతోపాటు బ్రిక్స్‌లో చేరాలని దరఖాస్తు చేసుకున్నాడు. డాలర్ ఆధిపత్యాన్ని కట్టడి చేసేందుకు నాయకత్వం వహిస్తున్న చైనా, రష్యా, ఇరాన్‌లతో భాగస్వామ్యం ఏర్పరచుకున్నాడు. ఇది యాదృచ్ఛికం కాదు. పెట్రోడాలర్‌ను ఎవ్వరు సవాల్ చేసినా వారు సమాధి కావాల్సిందే. రెండు వారాల క్రితం బిగ్గరగా ఇలా అన్నారు: అమెరికన్ చెమట, చాతుర్యం, శ్రమ వెనిజులాలో చమురు పరిశ్రమను సృష్టించాయి. దాని నిరంకుశ దోపిడీ అమెరికన్ సంపద, ఆస్తిపై నమోదైన అతిపెద్ద దొంగతనం. వెనిజులా చమురు అమెరికాకు చెందిందని నిస్సిగ్గుగా బహిరంగంగా చెబుతున్నారు. ఎందుకంటే అమెరికా కంపెనీలు దీనిని 100 సంవత్సరాల క్రితం అభివృద్ధి చేశాయి. ఈ తర్కం ప్రకారం, చరిత్రలో ప్రతి జాతీయం చేసిన వనరు దొంగతనం. కానీ ఇక్కడ లోతైన సమస్య ఉంది. పెట్రోడాలర్ ఇప్పటికే చనిపోతోంది. రష్యాఉక్రెయిన్ నుండి రూబిళ్లు, యువాన్లలో చమురును విక్రయిస్తుంది. సౌదీ అరేబియా బహిరంగంగా యువాన్ సెటిల్మెంట్ల గురించి చర్చిస్తుంది. ఇరాన్ సంవత్సరాలుగా నాన్–డాలర్ కరెన్సీలలో వ్యాపారం చేస్తోంది. చైనా 185 దేశాలలో 4,800 బ్యాంకులతో స్విఫ్ట్‌కు తమ స్వంత ప్రత్యామ్నాయమైన సిప్స్‌ని నిర్మించింది. బ్రిక్స్ డాలర్‌ను పూర్తిగా దాటవేసే చెల్లింపు వ్యవస్థలను చురుకుగా నిర్మిస్తోంది. ఎంబ్రిడ్జ్ ప్రాజెక్ట్ కేంద్ర బ్యాంకులు స్థానిక కరెన్సీలలో తక్షణమే లావాదేవీలను పరిష్కరించడానికి అనుమతిస్తుంది. 303 బిలియన్ బ్యారెళ్ల చమురుతో వెనిజులా బ్రిక్స్‌లో చేరడం వల్ల ఇది విపరీతంగా వేగవంతం అవుతుంది ప్రస్తుతం అమెరికా సైనిక దాడి కేవలం డాలర్ అస్తిత్వానికి ఎదురవుతున్న ఈ ప్రమాదం కారణంగానే జరిగిందని స్పష్టం అవుతుంది. మాదకద్రవ్యాలను ఆపకపోవడం అన్నది కేవలం ఓ సాకు మాత్రమే. వెనెజువెలా అమెరికా కొకైన్‌లో 1 శాతం కంటే తక్కువ వాటా కలిగి ఉంది. పైగా, మదురో ఉగ్రవాద సంస్థను నడుపుతున్నాడని ఎటువంటి ఆధారాలు లేవు. ఎన్నికలు లేని సౌదీ అరేబియాకు మద్దతు ఇస్తున్న అమెరికా ప్రజాస్వామికంగా ఎన్నికైన మదురోను కూల్చడం వెనుక ఆర్థిక ప్రయోజనాలే బలీయంగా ఉన్నాయని స్పష్టం అవుతుంది. అయితే చరిత్ర గతి ఎప్పుడూ ఒకే విధంగా ఉండబోదని అమెరికా గ్రహించాలి. అంతర్జాతీయంగా నానాటికీ అమెరికా ఒంటరి అవుతూ ఉండగా, సరికొత్త సమీకరణాలు ఏర్పడుతున్నాయి. ఐరోపా యూనియన్ సైతం అమెరికా ఉనికి చూసి నేడు అప్రమత్తం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. బ్రిక్స్ సమీకరణాలు ఒకవైపు, చైనా,– రష్యా మరోవైపు బలమైన ప్రతిఘటన ఇచ్చేందుకు సిద్ధపడుతోంది

# విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు

### - తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాల కిష్టారెడ్డి

### - సాయి సుధీర్ కళాశాలలో 'ట్రైఇంపాక్ట్ - సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రారంభోత్సవం







**కుషాయిగూడ, మార్చి 23, (తెలంగాణ దిశ):** ఈసీఐఎల్ టీఎస్ఐఐసీ కాలనీలోని సాయి సుధీర్ డిగ్రీ, పీజీ కళాశాలలో రిసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ (ఆర్ హెచ్ఎఫ్) ఆధ్వర్యంలో "ట్రైఇంపాక్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్" క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాల కిష్టారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సెంటర్‌ను ప్రారంభించారు. తెలంగాణ కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ పి. బాల భాస్కర్ గౌరవ అతిథిగా, స్కూల్ ఆఫ్ ఎంటర్ ప్రైజ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కె. సూర్య ప్రకాష్ గౌడ్ ప్రత్యేక అతిథిగా, రిసెర్చ్ హైట్ ఫౌండేషన్ ఫౌండర్, డైరెక్టర్ కె. నాగేంద్ర తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా కళాశాల మేనేజ్ మెంట్ చైర్మన్, రిసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ డైరెక్టర్ పరస్పరం అంగీకార పత్రాలను మార్చుకున్నారు. సాయిసుధీర్ ట్రై ఇంపాక్ట్ క్లబ్ విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి మాట్లాడుతూ జ్ఞానం పరంగా భారత్ ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నదని పేర్కొన్నారు. సరిహద్దులు లేని ప్రపంచంలో సముద్రపు లోతుల నుంచి ఆకాశం వరకు అనేక అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. తెలంగాణ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. భవిష్యత్తులో భారత్ ప్రపంచానికి మార్గదర్శక దేశంగా అవతరించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. జ్ఞానం కలిగిన వారే ప్రపంచాన్ని నడిపించే స్థాయికి చేరుకుంటారని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థుల ప్రదర్శనలు వినూత్నంగా ఉన్నాయనీ, ఇలానే ఎక్కువ మంది విద్యార్థులు రిసెర్చ్ లో పాల్గొని కళాశాలకు, తల్లిదండ్రులకు, దేశానికి గర్వకారణంగా నిలవాలని సూచించారు. సాయి సుధీర్ కళాశాల ట్రై ఇంపాక్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అనేది భవిష్యత్ లో మంచి పరిశోధన ఫలితాలను అందిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. రిసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ డాక్టర్ కె. నాగేందర్ మాట్లాడుతూ ఈ సెంటర్ ద్వారా విద్యార్థుల్లో పరిశోధన, ఆవిష్కరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్ డిజిఎస్) పై అవగాహన పెంపొందించడం ముఖ్య లక్ష్యమని తెలిపారు. ప్రొఫెసర్ పి. బాలభాస్కర్, కొనకల్ల సూర్యప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ ట్రై ఇంపాక్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎన్నో విజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కాలేజీ చైర్ పర్సన్ ఆర్. ఉషారాణి మాట్లాడుతూ ఈ సెంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ తో పాటు స్కిల్ డెవలప్మెంట్‌కు ఎంతో దోహదం చేస్తుందని చెప్పారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. పద్మ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రిసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ భవిష్యత్తులో 100 ట్రింపాక్ట్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను స్థాపించి రైసింగ్ తెలంగాణ 2047, వికసిత్ భారత్ 2047, సుస్థిర తెలంగాణ 2047 లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సంకల్పించింది. అలాగే ఎస్ డిజీ –2030 లక్ష్యాల సాధనకు కట్టుబడి ఉన్నట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మీరా రాణి, ప్రొఫెసర్ ఎల్. పద్మ పర్యవేక్షణలో వైస్ ప్రిన్సిపాల్ మోహన్ బాబు, కళాశాల హెచ్ డి లు, అధ్యాపకుల సహాయ, సహకారాలతో విజయవంతమైంది.



# ప్రభుత్వ స్థలాల్లో చొరబడితే కఠిన చర్యలు

### సర్వే నెంబర్ 376లోని ప్రభుత్వ భూమిని పరిశీలించిన ఆర్ఐ స్వర్ణలత

### కాప్రా తహసిల్దార్ బైరెడ్డి రాజేష్








**కాప్రా, మార్చి 23, (తెలంగాణ దిశ):** ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని కాప్రా తహసిల్దార్ బైరెడ్డి రాజేష్ హెచ్చరించారు. సర్వే నెంబర్ 376లోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన బోర్డును తాడ్పాల్, గోనె సంచులతో కప్పేసి, ఫెన్సింగ్ తీగలను తెంపేసి ఆక్రమణకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. తహసిల్దార్ ఆదేశాల మేరకు సోమవారం మండల రెవెన్యూ ఇన్ స్పెక్టర్ స్వర్ణలత సర్వే నెంబర్ 376 ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో కాప్రా తహసిల్దార్ ఆధ్వర్యంలో "ఇది ప్రభుత్వ స్థలం అంటూ" ఏర్పాటు చేసిన బోర్డును పూర్తిగా కనిపించకుండా కప్పివేసిన ఘటనను గుర్తించి, దానికి బాధ్యులైన వారిని తీవ్రంగా మందలించారు. వెంటనే ఆ కప్పి వేతలను తొలగించాలని ఆదేశించారు. దగ్గరుండి తొలగింప చేశారు. ప్రభుత్వ స్థలంలో పార్క్ చేసిన వాహనాలను తొలగించాలని సూచించారు. మంగళవారం ఉదయం 10 గంటల లోపు వాహనాలను తొలగించకపోతే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గతంలో తహసిల్దార్ సుచరిత ఆధ్వర్యంలో సుమారు 16 గుంటల విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, నిర్మాణ దశలో ఉన్న భవనాన్ని సీజ్ చేసిన విషయం గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ భూమి అప్పటి లాగే యథాతథంగా ఉంచాలని, తొలగించిన ఫెన్సింగ్‌ను తిరిగి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల్లో ప్రైవేట్ వాహనాల పార్కింగ్ అనుమతించబడదని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డులను దాచి పెట్టే చర్యలను సహించబోమని తహసిల్దార్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన వారిపై క్రిమినల్ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

### ఎంఎంసీ కార్యాలయ భూమి పూజ

# కార్యక్రమానికి హాజరుకండి

### - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, మార్చి 23, (తెలంగాణ దిశ) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి, వచ్చే వారం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనరేట్ కార్యాలయ (ఎంఎంసీ) భూమి పూజ కార్యక్రమానికి హాజరు కావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినమ్రంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉప్పల్ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కూడా నిధులు కేటాయించాలని అభ్యర్థించారు. ఉప్పల్ నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభా, మౌలిక సదుపాయాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. రామాంతపూర్ ప్రాంతం లో కొత్త పోలీస్‌స్టేషన్‌ను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని 2009లో నిర్మించిన ఇందిరా గృహకాల్ప పథకం కింద నిర్మించిన కాలనీల్లో నీటి లీకేజీలు, డ్రైనేజ్ సమస్యలు, స్లాబ్ పగుళ్లు వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఏ విభాగం పెట్టించుకోవటం లేదని ఆయన అన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలకు తక్షణ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కాలనీ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో వాటిని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలని కోరారు. పటేల్ కుంట అలాగే రామాం పూర్ చిన్న చెరువులను అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# బడ్జెట్‌లో బీసీలకు 'మొండిచేయి'..

### ఈసీఐఎల్ చౌరస్తాలో 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' ధ్వజం





**కుషాయిగూడ, మార్చి 23, (తెలంగాణ దిశ) :** తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్ అంకెల గారడీ తప్ప సామాన్య ప్రజలకు, ముఖ్యంగా బీసీ సామాజిక వర్గాలకు పైసా ప్రయోజనం లేని 'అప్పుల బడ్జెట్' అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్ పి) మేడ్చల్ జిల్లా నాయకులు ధ్వజమెత్తారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు సోమవారం కాప్రా సర్కిల్ పరిధిలోని ఈసీఐఎల్ చౌరస్తాలో జిల్లా పార్టీ అధ్యక్షులు పనగట్ల చక్రపాణి గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ ధర్నా నిర్వహించాయి. ప్లకార్డులు చేతబూని, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో చౌరస్తాను హోరెత్తించారు.

**బీసీలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వం**

ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు బీసీలకు ఇచ్చిన 'కామారెడ్డి డిక్లరేషన్' హామీలను బడ్జెట్‌లో పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో బీసీ సంక్షేమానికి ఏడాదికి రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామని గొప్పలు చెప్పిన పాలకులు, నేడు బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తకపోవడం బీసీలను దారుణంగా వంచించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీపై ప్రభుత్వం మౌనం వహించడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు.

**42 శాతం రిజర్వేషన్లే మా లక్ష్యం:** జిల్లా పార్టీ అధ్యక్షులు పనగట్ల చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తక్షణమే 42 శాతం రిజర్వేషన్లు కల్పించా లని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ. 2,500 ఇచ్చే మహాలక్ష్మి పథకానికి,నిరుద్యోగ భృతికి తగిన నిధులు కేటాయించకపోవడం మోసపూ రితమన్నారు. ఈ బడ్జెట్ బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని విమర్శించారు.

**ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం**

ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండి వైఖరిని వీడి, సవరించిన బడ్జెట్‌లో బీసీలకు న్యాయం చేయాలని జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సింగం అరుణ్ పటేల్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ బడ్జెట్ కేవలం అప్పుల కుప్పగా మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు నీరుడు షాలిని, నాయకులు బయ్యా వెంకటేష్, ప్రవీణ్ కుమార్, అంబాల శ్రీనివాస్, అభిరామ్, కమలాకర్, మహేష్ గౌడ్, మచ్చ పాండు గౌడ్, దుర్గ ప్రసాద్, సుల్తాన, మహేందర్ యాదవ్, జి. కృష్ణ కుమార్, బాసీద్, అనిల్, మారుతి శ్రీనివాస్, మురళి, బన్నాపురం నాగరాజు, నర్సింగ్ రావు, కాసుల నందం గౌడ్, అనూప్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# జాగ్రత్త మిత్రమా!.. వ్యాధుల ఉచ్చులో చిక్కుకోవద్దు



తస్మాత్ జాగ్రత్త! అన్ని విషయాల్లోనూ పెద్దలు చెప్పే మాట ఇది. ముందుచూపు ఉన్నవాడే ముందడుగు వేయగలడు. ఆర్థిక విషయాల్లోతప్పటడుగు వేస్తే.. రెండేండ్లకో, మూడేండ్లకో కోలుకునే అవకాశం ఉంటుంది. ఆరోగ్యం విషయంలో ఈ సూత్రం చెల్లదు.

'నాకేమవుతుంది!' అన్న నిర్లిప్త ధోరణి మిమ్మల్ని రోగాల విష వలయంలోకి నెట్టేయొచ్చు. ఆరోగ్య బీమా ఉంటే.. చికిత్సకయ్యే ఖర్చులు మీదపడకుండా ఉంటాయి కానీ, మీ బీమా రోగం రాదన్న ధీమా ఇవ్వదు కదా!! మరెలాగంటారా?!

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమబద్ధమైన జీవనశైలితో రాగల రోగాలను అడ్డుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఎలాంటి వ్యాధుల నైనానయం చేసే శక్తి ఆధునిక వైద్యరంగానికి ఉంది! కానీ, అదే సమయంలో వేగంగా పెరుగుతున్న రోగాలు వైద్యులకూ సవాళ్లు విసురుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త లు తీసుకోవడం చాలా అవసరం అంటున్నారు వైద్యులు. గతంతో పోలిస్తే.. ఈ మధ్య కాలంలో ఎలాంటి వ్యాధులు పెరుగుతున్నాయి, అందుకు కారణాలేంటి? మారుతున్న జీవనశైలి మనిషి ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నది? తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం!

ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్' నానుడి ఆరోగ్యానికి సంబంధించినదే! సంపాదన వేటలో పరుగులు తీస్తున్న మనిషి ఆరోగ్యాన్ని చాలా నిర్లక్ష్యం చేస్తున్నాడు. దీనికితోడు జిహ్వ చాపల్యాన్ని చంపుకోలేక, అలవాట్లు మానుకోలేక, వ్యాయామం చేసే తీరిక లేకొ ఇలా రకరకాల కారణాలతోరోగాలను కొని తెచ్చుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో నడి వయసులోనే దవాఖానల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.ముప్పయ్ ఏండ్లలోనే గుండె జబ్బులు పలకరిస్తున్నాయి. నలభై రాకముందే కిడ్నీలు మొరాయిస్తున్నాయి. డబ్బుల్లో రావాల్సిన నరాల సమస్యలూ యాభై రాకముందే ముంచుకొస్తున్నాయి. దీనికంతటికీ కారణంఆరోగ్యంపై శ్రద్ధ లేకపోవడమే!

ముప్పయ్ రాకుండానే.. గుండెకు ముప్పు: ఒకప్పుడు యాభై ఏండ్లు దాటాక గానీ, గుండె సమస్యలు పలకరించేవి కావు. కానీ, ఇప్పుడు ముప్పయ్‌లోకి అడుగు పెట్టకముందే గుండె సంబంధిత రుగ్మతలు వస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది, 20 30 ఏళ్లలోపు వయసు వారు కూడా తీవ్రమైన గుండె జబ్బులకు గురవడం విచారకరం. అయితే చిన్న వయసులోనే గుండె సంబంధిత వ్యాధులకు గురైనవారిలో ఎక్కువ శాతం రక్తపోటు లేదా అధిక కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడుతున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. ఈ తరహా సమస్యల్లో చిక్కుకుంటున్న వాళ్లు కనీస ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకోకపోవడం గమనార్హం. తాజా అధ్యయనాల ప్రకారం గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగుల్లో సుమారు 30 శాతం మంది 30 ఏళ్లలోపు వారే ఉంటున్నారట. వీరంతా అసహజమైన జీవనశైలి కారణంగానే ఇలాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. గణాంకాల ప్రకారం భారతదేశంలో 40 ఏళ్లలోపు వయసున్న ప్రతి నలుగురిలో ఒకరికి గుండెపోటును చూస్తున్నాం. సరైన జీవనశైలి, వ్యాయామం, నడక, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా గుండెకు వచ్చే జబ్బులను చాలా వరకు నియంత్రించవచ్చు.

యువతలో బలహీనత: న్యూరాలజిస్టుల నివేదికల ప్రకారం స్ట్రోక్ కేసులను పరిశీలిస్తే, దాదాపు మూడోవంతు యువతలోనే నమోదవుతున్నాయి. దీనికి అధిక రక్తపోటు, పొగ తాగడం, మద్యం సేవించడం, ఒకేచోటఎక్కువసేపు కూర్చునిఉండే ఉద్యోగాలు చేయడం వల్ల న్యూరాలజీ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకోకుండా.. ముందస్తుగా మేల్కొనాలి. దురలవాట్లకు చెక్ పెట్టాలి. వర్క్‌స్టైల్‌ని మీ ఆరోగ్యానికి తగ్గట్టుగా డిజైన్ చేసుకోవాలి. ఆరోగ్యపరంగా ఏదైనా అసౌకర్యాన్ని గుర్తించిన వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి.

పీడిస్తున్న మధుమేహం: జీవనశైలి రుగ్మతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కాస్తఅలవాట్లు పక్కదారి పట్టినా.. మధుమేహం దాడి చేస్తున్నది. గతేడాది యువ ఉద్యోగులు, విద్యార్థుల్లో మధుమేహం, ఊబకాయ సమస్య అనూహ్యంగా పెరగడం కనిపించింది. ఎండోక్రైనా లజీ విభాగం

## చికిత్స ఒక్కటే పరిష్కారం కాదు జీవనశైలిలో మార్పే శ్రీరామరక్ష

గణాంకాల ప్రకారం, టైప్ 2 మధుమేహం యువతలో వేగంగా పెరుగుతున్నది. సుమారు 40 శాతం మందికి తమకు డయా బెటిస్ ఉందన్న విషయమే తెలియకపో వడం గమనార్హం.

అంతేకాదు, మధుమేహ బాధితుల్లో 50 శాతం మందిలో వ్యాధి అస్సలు నియంత్రణలో ఉండటం లేదట. దీనివల్ల మూత్రపిండాల సమస్యలు, గుండె వ్యాధులు, సంతానలేమి తదితర సమస్యలు చాపకింద నీరులా విస్తరిస్తుండటం ఆందోళన కలిగించే అంశం.


నెఫ్రాలజీ రికార్డుల ప్రకారం, డయాబెటిస్, హైపర్ టెన్షన్‌ను సమయానికి గుర్తించకపోవడం వల్ల యుక్త వయసులోనే తీవ్రమైన కిడ్నీ వ్యాధుల బారినపడుతున్నారు. వీటిని ప్రాథమిక దశలో గుర్తించి, తగిన చికిత్స తీసుకుంటే ప్రమాద తీవ్రత గణనీయంగా తగ్గుతుంది.

పొట్ట చుట్టూ సమస్యలే: ఫ్యాటీ లివర్, కొలొరెక్టల్, పేగు సంబంధిత వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అధిక క్యాలరీలతో కూడిన ఆహారం,ప్రాసెస్డ్ ఫుడ్స్, మద్యపానం,అస్థిర జీవనశైలితదితర కారణాలతో ఈ సమస్యలు యువతలోనే ఎక్కువగా చూస్తున్నాం. మన దేశంలో నమోదవుతున్న కొలొరెక్టల్ క్యాన్సర్ కేసుల్లో 30 40 శాతం మంది 50 ఏళ్లలోపు వారే ఉండటం ఆందోళన కలిగించే అంశం.


క్యాన్సర్ దాడి: ఈ మధ్య కాలంలో బ్రెస్ట్, ఒవేరియన్, గ్యాస్ట్రో ఎంటెస్టినల్ వంటి క్యాన్సర్లు ఎక్కువగా యువతలోనే కనిపిస్తున్నాయి. వయసుతో సంబంధం లేని ఈ వ్యాధిపై జన్యు లక్షణాలు, జీవనశైలి, పర్యావరణ ప్రభావాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

మొత్తంగా చూస్తే, గుండె, మెటబాలిక్, కాలేయం, మూత్రపిండాలు, న్యూరాలజీ, జీర్ణవ్యవస్థలకు సంబంధించిన నివారించగల దీర్ఘకాలిక వ్యాధుల్లో 10 15 శాతం పెరుగుదల కనిపిస్తుంది. వీటిలో చాలా వ్యాధులను ప్రారంభదశలో స్క్రీనింగ్, జీవనశైలి మార్పులు, సమయానికి వైద్య పరీక్షల ద్వారా నివారించగలిగినవే.

వారిపై తీవ్ర ప్రభావం: మారుతున్న జీవనశైలి, పని ఒత్తిడి కారణంగా కొన్ని రంగాల్లో పనిచేసే ఉద్యోగులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. అందులో ముఖ్యంగా ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో పని చేసే యువత రోజుకు పది గంటలకు పైగా ఒకే చోట కూర్చుని పనిచేయడం, సరైన వ్యాయామం లేకపోవడం, ఎక్కువగా జంక్ ఫుడ్, ప్రాసెసింగ్ ఫుడ్‌పై ఆధారపడటం వల్ల అనారోగ్య సమస్యల్లో చిక్కుకుంటున్నారు. దేశ జీడీపీ, అభివృద్ధికి వెన్నెముకగా ఉండాల్సిన యువత అనారోగ్యం పాలవ్వడం దేశ భవిష్యత్తుకే ముప్పుగా పరిణమిస్తున్నది. ఈ అంశాన్ని ప్రతిఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలి.జబ్బు వచ్చిన తర్వాత చికిత్సచేయడం కంటే, జబ్బు రాకుండా చూసుకోవడం ప్రధానం అని గ్రహించాలి. జీవనశైలిలో మార్పుల ద్వారా వ్యాధులను వృద్ధాప్యం వరకు వాయిదా వేయవచ్చు. ఆర్థికంగా దెబ్బ: కార్పొరేట్ ఎంప్లాయి మొదలుకొని, సాధారణ ఉద్యోగి వరకు ఆరోగ్య బీమాపై అవగాహన కలిగి ఉంటున్నారు. ఉద్యోగంలో చేరగానే.. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటున్నారు. అయితే హెల్త్ ఇన్సూరెన్స్ చికిత్సకు అయ్యే ఖర్చును భరిస్తుందేమో కానీ, వ్యాధులను రాకుండా అడ్డుకోదు కదా! ఇక ఇన్సూరెన్స్ లేనివారి పరిస్థితి అగమ్య గోచరం.ఒక వ్యక్తి ఆస్పత్రి పాలైతే.. ఆ భారంకుటుంబం అంతా మోయాల్సి వస్తుంది. తీవ్రమైన వ్యాధులు తలెత్తితే.. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగులుతుంది.




## నిద్ర పట్టడం లేదా!



అన్ని బాధ్యతలు తీరినా, కావాల్సినంత సమయం ఉన్నా, ఆరోగ్యం నిలకడగా ఉన్నా.. వృద్ధాప్యంలో వెంటాడే సమస్య నిద్రలేమి. ఇందుకు ప్రధానమైన కారణం ఒంటరితనమే అని పలు పరిశోధనలు చెబుతున్నాయి. ఈ ఒంటరితనంతో మనిషి లేనిపోని ఆలోచనల వలయంలో చిక్కుకుంటాడు. పిల్లలు ఎవరి జీవితంలో వాళ్లు సెటిలయ్యారన్న తృప్తి ఉన్నా.. తమ దగ్గర లేరన్న బెంగ మనసును తొలిచేస్తూ ఉంటుంది. తమకు ఏదైనా జరిగితే పిల్లలు వస్తారో, రారో అన్న అనుమానం కూడా వెంటాడుతుంది.ఇవన్నీ వయసు పైబడిన వారి మనసులో బలంగా నాటుకుపోతాయి. పైకి ఆరోగ్యంగా కనిపించినా, మానసికంగా ఆందోళనగా ఉంటారు. ఫలితంగా రాత్రి ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టదు. మనసు ఉత్సాహంగా లేకపోతే.. తీసుకునే ఆహారంపై ఆ ప్రభావం పడుతుంది. అన్యమనస్కంగా తినడం, భోజనాన్ని స్కిప్ చేయడం లాంటివి చేస్తుంటారు. దీనివల్ల ఆరోగ్యం కుంటుబడుతుంది. విటమిన్ల లోపం తలెత్తి కాళ్లుచేతులు లాగడం మొదలవుతుంది. రక్తహీనత కూడా వెంటాడుతుంది. ఇవన్నీ నిద్రను దెబ్బతీస్తాయి. నిద్రలేమితో సతమతం అవుతుంటే.. వైద్యుణ్ని సంప్రదించండి. మధుమేహం, రక్తపోటు తదితర సమస్య లు ఉన్నట్లయితే.. వైద్యులు సూచించిన మందులు సమయానికి తీసుకోవాలి. కొన్నిసార్లు మందుల మోతాదులు తగ్గించడం, మార్చడం వల్ల కూడా నిద్రలేమి సమస్యకు చెక్‌పెట్టొచ్చు. అయితే, మందుల విషయంలో సొంత నిర్ణయం తీసుకోకుండా, మీ వైద్యుణ్ని సంప్రదించాలని గుర్తుంచుకోండి. కొందరు మధ్యాహ్నం పూట ఎక్కువ సమయం నిద్ర పోతుంటారు. ఆ ప్రభావం రాత్రి నిద్ర మీద పడుతుం ది. కాబట్టి, మధ్యాహ్నం వేళ.. కాసేపే నడుం వాల్చండి. అలాగే, ఉదయం, సాయంత్రం నడక తప్పనిసరి చేసుకుంటే.. ఇది రాత్రి నిద్రకు ఉపకరిస్తుంది. రాత్రి తేలికపాటి భోజనం చేయడం మంచిది. తిన్న తర్వాత ఓ పదిహేను నిమిషాలు నడక సాగించండి. పడుకునే ముందు ఫోన్ పక్కన పెట్టండి. శ్రావ్యమైన సంగీతం వినండి. కాసేపు పుస్తకం చదవండి. పడుకునే ముందు ఒక గ్లాసు పాలు తాగితే మంచిది. అన్నిటికీ మించి.. జీవితం చూసొచ్చిన మీరు.. గతాన్ని తవ్వుకుంటూ కాలాన్ని వృథా చేసుకోకండి. మానసికంగా ప్రశాంతం గా ఉంటే.. నిద్రలేమి సమస్య దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# ఆ రాళ్లను తేలిగ్గా తీసుకోకండి..

గాల్‌బ్లాడర్ స్టోన్స్ వీటినే వాడుక భాషలో పిత్తాశయ రాళ్లు అంటారు. ఈ పిత్తాశయం అనేది కాలేయం కింది భాగంలో ఉంటుంది. కాలేయం నుంచి పైత్య రసం పిత్తనాళం ద్వారా చిన్న పేగుకు చేరుతుంది. దీనినే కామన్ బైల్‌డక్ అంటారు. అంతేకాకుండా పిత్తాశయంలోని పైత్యరసం ఖాళీ అయినప్పుడు అది కూడా పిత్తనాళం ద్వారానే చిన్న పేగుకు చేరుతుంది. ఈ క్రమంలో పిత్తాశయంలో లేదా పిత్తనాళంలో రాళ్లు ఏర్పడుతుంటాయి. అయితే పిత్తనాళంలో రాళ్లు ఏర్పడటం అనేది అరుదుగా చూస్తుంటాం. ఈ పిత్తాశయంలో, పిత్తనాళంలో ఏర్పడే రాళ్లు, వాటితో తలెత్తే సమస్యలు, లక్షణాలు, నిర్ధారణ, చికిత్సా పద్ధతులను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.



అధిక బరువు, ఊబకాయంతో సతమతమయ్యే వాళ్లలో గాల్‌బ్లాడర్ స్టోన్స్ ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. అంతేకాకుండా హార్మోన్ల మార్పిడి వల్ల పురుషుల్లో కన్నా మహిళల్లో ఎక్కువగా ఈ సమస్య తలెత్తుతుంది. అలాగే డయాబెటిస్ రోగుల్లో కూడా గాల్‌బ్లాడర్ స్టోన్స్ ఏర్పడే ప్రమాదం ఉంటుంది. అయితే 80 నుంచి 90 శాతం వరకు పిత్తాశయంలోని రాళ్లు సైలెంట్‌గా ఉంటాయి. అంటే వీటి వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండవు. ఏదైనా ఇతర అనారోగ్య సమస్యల కోసం అల్ట్రాసౌండ్ స్కాన్ చేసినపుడు గాల్‌బ్లాడర్ స్టోన్స్ ఉన్నట్లు బయటపడుతుంటాయి. అయితే పిత్తాశయ రాళ్ల వల్ల పెద్ద సమస్యలు ఉండవు. అందుకని వీటికి పెద్దగా చికిత్స తీసుకునే అవసరం ఉండకపోవచ్చు.

అలాంటి సందర్భంలో..: 10 20 శాతం మందిలో కొన్నిసార్లు పిత్తాశయంలోని రాళ్ల వల్ల ఇన్‌ఫ్లమేషన్ గానీ, ఇన్‌ఫెక్షన్ గానీ తలెత్తుతుంది. దీనివల్ల ఉదరం పైభాగంలో భరించలేని నొప్పి వస్తుంది. కామెర్లు రావడం, చలిజ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాంటి సందర్భంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించాలి. ఈ స్కానింగ్ ద్వారా గాల్‌బ్లాడర్ స్టోన్స్ ఉన్నట్లు నిర్ధారణ జరిగితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఇలా తీవ్రమైన నొప్పికి కారణమయ్యే పరిస్థితినే వైద్య పరిభాషలో 'అక్యూట్ కాలిక్యులస్ కోలిస్‌సిట్కస్టైటిస్' అంటారు. ఇది ఒక మెడికల్ ఎమర్జెన్సీ. ఇలాంటి సందర్భంలో వెంటనే శస్త్రచికిత్స జరిపి, రాళ్లను తొలగించాల్సి ఉంటుంది.

రాళ్లు ఏర్పడితే..: పిత్తాశయంలో ఉన్న రాళ్లు కొన్నిసార్లు పిత్తనాళంలోకి అడ్డుగా పడిపోవచ్చు. దీనినే కామన్ బైల్‌డక్ స్టోన్ (సీబీడీ) అంటారు. ఇలాంటి సమయంలో రోగికి తీవ్రమైన నొప్పి లేదా కామెర్లు (జాండీస్) రావడం జరుగుతుంది. అంతేకాకుండా 'అక్యుట్ ప్యాంక్రియాటైటిస్' అనే జబ్బు కూడా వచ్చే ప్రమాదం ఉంటుంది. ఇది కూడా ఒక మెడికల్ ఎమర్జెన్సీ. కొన్ని సందర్భాలలో ఇది ప్రాణాంతకంగా మారవచ్చు. అందుకని సకాలంలో శస్త్రచికిత్స చేయడం చాలా అవసరం. లేకపోతే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

చికిత్స ఎప్పుడు, ఎవరికి..?: పిత్తాశయ రాళ్లకు అన్ని సందర్భాలలో శస్త్రచికిత్స అవసరం లేదు. కానీ, డయాబెటిస్ రోగులు, ప్రెగ్నెన్సీకి ప్లాన్ చేసుకునే మహిళలు గాల్‌బ్లాడర్ స్టోన్స్ ఉంటే వెంటనే శస్త్రచికిత్స చేయించుకోవడం ఉత్తమం. లేకపోతే అది తీవ్ర పరిణామాలకు దారి తీయవచ్చు. పిత్తాశయ రాళ్ల వల్ల నొప్పి వచ్చినప్పుడు ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. మందుల వల్ల గాల్‌బ్లాడర్ స్టోన్స్ (పిత్తాశయంలోని రాళ్లు) గానీ, కామన్ బైల్‌డక్ స్టోన్స్ (పిత్తనాళం రాళ్లు) గానీ కరగకపోవచ్చు. అందుకని ఈ రాళ్లను తొలగించడానికి శస్త్రచికిత్స ఒక్కటే మార్గం. పిత్తాశయంలోని రాళ్ల వల్ల 80 నుంచి 90 శాతం వరకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండవు. ఏ విధమైన లక్షణాలు, సమస్యలు లేనంత వరకు పిత్తాశయంలోని రాళ్ల కోసం చికిత్స అవసరం పడకపోవచ్చు. కానీ, పిత్తనాళంలో ఉన్న రాళ్ల విషయంలో మాత్రం చికిత్స తప్పనిసరి. వాటివల్ల ఎలాంటి సమస్య లేనప్పటికీ ఎప్పటికైనా కామెర్లు, జ్వరం, ప్యాంక్రియాటైటిస్ సమస్యలు పొంచి ఉంటాయి.

లక్షణాలు: కామెర్లు రావడం, చలి జ్వరం, కడుపులో భరించలేని నొప్పి రావడం,. నిర్ధారణ పద్ధతులు: పిత్తాశయంలోని రాళ్లను లేదా పిత్తనాళంలో ఉన్న రాళ్లను గుర్తించడానికి అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు చేస్తారు. ఎంఆర్ సీపీ ద్వారా కూడా ఈ రాళ్లను నిర్ధారించవచ్చు. చికిత్సా పద్ధతులు: ఎండోస్కోపి శస్త్రచికిత్స పద్ధతి (ఈఆర్‌సీపీ)ద్వారా పిత్తనాళంలో ఉన్న రాళ్లను తొలగించడం ఉత్తమం. ఇది అడ్వాన్స్ శస్త్రచికిత్స. గతంలో ఓపెన్ సర్జరీ ద్వారా చేసేవారు. ఓపెన్, ల్యాపరోస్కోపీ సర్జరీల కంటే ఈఆర్‌సీపీ పద్ధతిలో చాలా సులభమైన పద్ధతి. కాగా, పిత్తనాళంలోని రాళ్లను తీసిన తరువాత పిత్తాశయం సర్జరీ కూడా చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే పిత్తాశయంలోని రాళ్లు మళ్లీ పిత్తనాళంలోకి పడిపోయే అవకాశం ఉంటుంది. అందుకని పిత్తాశయంలోని రాళ్లను పూర్తిగా తొలగిస్తే, పిత్తనాళంలో మళ్లీ రాళ్లు ఏర్పడే అవకాశం ఉండదు. కీహోల్ పద్ధతి ద్వారా పిత్తాశయంలోని రాళ్లను తొలగించడం జరుగుతుంది.

# యువగుండెను కాపాడుకుందాం...



మన కళ్లముందున్న యువతరం చూసేందుకు ఆరోగ్యంగా, ఫిట్‌గా కనిపించినా.. అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలిపోతున్నారు. భారత్‌లో 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు వారిలో నెలకొన్న ఈ ప్రమాదంపై 2025లో ఎయిమ్స్-ఐసీఎంఆర్ కలిసి చేపట్టిన అధ్యయనంలో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. యువతలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాల్లో 42.6 శాతం గుండె సంబంధిత సమస్యలే కారణమని ఈ పరిశోధన వెల్లడించింది. చాలామంది యువకులు తాము ఆరోగ్యంగా ఉన్నామని, తమకు ఎలాంటి లక్షణాలు లేవని భావిస్తుంటారు. బయటికి ఆరోగ్యంగా కనిపించడం అంటే గుండె సంపూర్ణంగా పనిచేస్తున్నదని అర్థం కాదు. చాలా సందర్భాలలో ముప్పు కారకాలను ప్రాథమిక దశలో గుర్తించకపోవడమే ప్రమాదాలకు దారితీస్తున్నది. మన గుండెలో తెలియని చర్యలు అనేకం జరుగుతుంటాయి. అందు లో ఒకటే ఈ ఏఎస్‌సీవీడీ. ధమనుల్లో కొవ్వు, కొలెస్ట్రాల్ పేరుకుపో వడాన్ని 'అథెరోస్క్లెరోటిక్ కార్డియోవాసులర్ డిసీజ్' (ఏఎస్‌సీవీడీ) అంటారు. ఇది చాలా నెమ్మదిగా జరిగే ప్రక్రియ. 50 శాతం కంటే తకువ బ్లాకేజీలు ఉన్నప్పుడు శరీరంలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. 70 శాతం దాటితేనే విశ్రాంతి తీసుకునే సమయంలో కూడా గుండె నొప్పి లక్షణాలు బయట పడతాయి. అప్పటివరకు ఆరోగ్యంగా ఉన్న యువకుడిలో ఒకసారిగా ఈ కొవ్వు నిల్వలు చిట్లిపోతే అది తీవ్రమైన గుండెపోటుకు దారితీస్తుంది. మారుతున్న జీవనశైలి కారణంగానే యువతలో ఈ ముప్పు పెరుగుతున్నది. వాటిల్లో ధూమపానం, ఈ-సిగరెట్లు, మాదకద్రవ్యాల వాడకం, విపరీతమైన ఒత్తిడి ప్రధానమైనవి. శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం, జంక్ ఫుడ్, మితిమీరిన మద్యపానం లాంటి చెడు అలవాట్లు మన గుండెకు చిల్లులు పెడుతున్నాయి. ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, ఒత్తిడి లేని జీవితం, సకాలంలో ఆరోగ్య పరీక్షలు.. ఇవే మీ గుండెను భద్రంగా ఉంచే ఆయుధాలు.

# కాఫీకీ ఓ టైముంది!

కాఫీ తాగడం.. ఆరోగ్యానికి మంచిదే! కానీ, ఎప్పుడు తాగుతున్నాం? ఎంత తాగుతున్నాం? అనేది కూడా ముఖ్యమని అంటున్నారు అమెరికా పరిశోధకులు. గుండె, శరీరం మీద కెఫీన్, కాఫీ తాగే సమయం చూపించే ప్రభావాలపై ఓ పరిశోధన జరిగింది. అమెరికా నేషనల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎగ్జామినేషన్ సంస్థ.. దాదాపు పదేండ్లపాటు ఈ అధ్యయనం నిర్వహించింది. ఇందులో పాల్గొన్నవారు రోజుకు కనీసం ఒక్కసారైనా తీసుకునే ఆహారం, పానీయాలను క్షుణ్నంగా పరిశీలించింది. సర్వే సమయంలో సంభవించిన మరణాలను, వాటి కారణాలను నమోదు చేసింది. ఆయా డేటాలను విశ్లేషించి.. ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. వీరిలో 52 శాతం మందికి కాఫీ తాగేఅలవాటు ఉంది. అందులోనూ 36 శాతం మంది ఉదయం మాత్రమే కాఫీ తాగుతుండగా.. మిగిలిన 16 శాతం మంది రోజులో అనేకసార్లు కాఫీ తాగుతారని చెప్పారు.



అయితే, కాఫీ తాగనివారితో పోలిస్తే.. ఉదయంపూట కాఫీ తాగేవారికి ఏ కారణంతోనైనా మరణం సంభవించే ముప్పు 16 శాతం, గుండెజబ్బుతోమరణించే ముప్పు 31శాతం తక్కువగా ఉంటున్నట్టు తేలింది. అయితే,రోజంతా రెండుమూడు సార్లు కాఫీ తాగేవారిలో ఇలాంటి ప్రయోజనాలేవీ కనిపించలేదని పరిశోధకులు వెల్లడించారు. మధ్యాహ్నం, సాయంత్రం కాఫీ తాగేవారిలో జీవ గడియారం క్రమం తప్పుతుందనీ, మెలటోనిన్ వంటి హార్మోన్ల మోతాదులు అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. ఫలితంగా ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీసి.. రక్తపోటు, గుండెజబ్బు ముప్పు పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.

# అందరి చూపు సుప్రీం వైపు...!



ఢిల్లీ,: సర్ ప్రక్రియలో ఎలాంటి ఆటంకం కలిగించేందుకు అనుమతి ంచబోమని, అన్ని రాష్ట్రాలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంలో అవసరమైతే ఆదేశాలు జారీ చేస్తామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ అంశంపై దాఖలైన పిటిషన్‌పై సోమవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది.సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడుతూ అధికారుల పేర్లు ఇవ్వాలని ఎన్నికల సంఘం రాష్ట్రాన్ని ఎప్పుడూ కోరలేదన్నారు. దీనికి సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ స్పందిస్తూ ప్రస్తుతం 8,500 మంది అధికారుల జాబితాను సమర్పించామని, దాన్ని కోర్టు స్వీకరించాలని కోరారు. దీనికి సీజేఐ స్పందిస్తూ ఆ జాబితాలో అధికారుల పేర్లు, హోదాలు, పనిచేసే ప్రాంతాల వివరాలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. వారిని ఎలా సంప్రదిస్తారు? మరుసటి రోజే సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల (ఈఆర్‌వో) వద్ద రిపోర్ట్ చేయగల రా? అంటూప్రశ్నించగా.. దానికి న్యాయవాది దివాన్ అవునని సమాధా నం ఇచ్చారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సమీక్షలో భాగంగా పశ్చిమబెంగాల్ లోని ఓటర్ల జాబితాల్లోంచి వేలాది మంది ఓ టర్లను అనర్హులుగా తొలగించారు. రాజ్యాంగ విరుద్ధంగా ఈ విధంగా తొలగించడం అన్యాయమని ధ్వజమెత్తుతూ దీనిపై తక్షణం జోక్యం చేసుకోవాలని కోరుతూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావడం సంచలనం కలిగించింది. నిజాయితీగా అర్హులైన ఓటర్లకు జాబితా లో చోటులభించాలి. ఈమేరకు హామీ ఇవ్వాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దే. ప్రత్యేక సమగ్ర సర్వే చేపట్టక ముందు పశ్చిమబెంగాల్ ఓటర్లజాబితాలో 7.66 కోట్ల వరకు ఎంట్రీలు ఉండేవి. అందు లోంచి 58 లక్షల పేర్లను తొలగించిన తరువాత ఎన్నికల కమిషన్ నమూనా జాబితాను ప్రకటించి 1.16 కోట్ల ఎంట్రీల్లో తార్కిక వైరుధ్యాలు ఉన్నాయని వెల్లడించింది.

ఇది క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించి చేసిన ఒక ప్రయత్నం లేదా నిర్ణయాన్ని సమర్థించుకోవ డానికి ఉపయోగించే తప్పుడు సాకును తెలియజేస్తుందని చెప్పవచ్చు. ఈ పొంతనలేని అసంబ ద్ధమైన పదజాలాన్ని ఉపయోగించి ఎన్నికల సంఘం పశ్చిమబెం గాల్ ప్రజలను తమ పాలకులను ఎన్నుకునే హక్కు నుంచి దూరం చేయడమే అవుతుంది. ఓటు వేసే హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభంలా ఆచరణలో ఉంటోంది.


భారత దేశం వివిధ భాషలు, మాండలికాలు కలిగిన బహుళ భాషా సమాజం ప్రపంచం లోనే అత్యధికంగా భాషా వైవిధ్యం కలిగిన దేశాల్లో ఒకటిగా భారత్ పరిగణించబడుతోంది. రాజ్యాం గం లోని 8వ షెడ్యూల్‌లో 22 భాషలకు గుర్తింపు కలిగినప్పటికీ దేశవ్యాప్తంగా వందలాది భాషలు వాడుకలో ఉన్నాయి. ఈ భాషల్లో సరైన నామవాచకాలు రాసేటప్పుడు తేడాలు, అనివార్యమైన తప్పులు చోటు చేసుకోవచ్చు. దీదీ వాదనలను న్యాయమూర్తులు జోయ్‌మల్య బాగ్చి, వీఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. సీఎం ఆవేదనలో నిజం ఉందని, ప్రతీ సమస్యకూ పరిష్కారం ఉ ంటుందని హామీ ఇచ్చింది. అనంతరం మమతా బెనర్జీ పిటిషన్‌పై స్పందన కోరుతూ ఎన్నికల సంఘానికి ధర్మాసనం నోటీసు కూడా జారీ చేసింది.విచారణ సందర్భంగా.. ఈసీఐపై మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఈ ప్రక్రియలో ఆధార్‌ను అంగీకరించకుండా కోర్టు ఆదేశాలను ఎన్నికల సంఘం ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు తమ రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని మండిపడ్డారు. సర్ ఒత్తిడి కారణంగా 100 మందికిపైగా ప్రజలు మరణించారని దీదీ ఆరోపించారు. అనేక మంది ఆసుపత్రి పాలయ్యారన్నారు. ప్రజల హక్కులను కాపాడండి అంటూ దీదీ తన వాదనలను ముగిం చారు.పురుషులు, మహిళలు వయసులో తేడాలు, 15 ఏళ్ల కన్నా తక్కువ లేదా 50 ఏళ్ల వరకు తమ తల్లిదండ్రులకు తమకు తేడా ఉండవచ్చు. కొన్నిసార్లు దంపతులకు ఆరు లేదా అంతకన్నా ఎక్కువ సంతానం ఉండవచ్చు. చాలా మంది మహిళలు తమ పేరు చివరన తమ భర్త పేరు చేర్చుకుంటుంటారు. ఇవన్నీ భారత దేశ ప్రజాజీవ నంలో వాస్తవాలే తప్ప ఓటర్ల జాబితాలో పేర్లను కొట్టేసినంత శక్తివంత మైన తార్కిక వ్యత్యాసాలు కావు. ఈ సమస్యలను సుప్రీం కోర్టే స్వయంగా ప్రస్తావించిందని గుర్తు చేసుకోవాలి. ఓటర్ల జాబితాల్లో ంచి పేర్లను తొలగించడానికి వాటిని సాకుగా ఉ పయోగించడంపై తన అసమ్మతిని వ్యక్తం చేసింది కూడా. ఈ అసంబద్ధ కారణాలను ఎన్నికల కమిషన్‌కు ఎత్తిచూపడానికి తన వాదనలు వినిపించగా వాటిని ఎన్నికల కమిషన్ తిరస్కరించిందని మమతా బెనర్జీ ఆరోపిస్తున్నారు.ఇక చేసేది లేక ఆమె నేరుగా సుప్రీం కోర్టు ముందు హాజరై తన వాదనలను వినిపించారు.

దీనికి సుప్రీం కోర్టు స్వాగతించింది. ఈ గజిబిజి వ్యవహారంలో మరింత సున్నితంగా వ్యవహరించాలని ఎన్నికల కమిషన్‌కు సుప్రీం కోర్టు సూచించింది. మమతా బెనర్జీ వాదించిన అంశాలు ఒక సమస్యకు ప్రాధాన్యం ఇవ్వాలని మనల్ని అడుగుతున్నాయి. వి మనదేశం ప్రజాస్వామ్యయుతంగా పనిచేయడానికి కీలకమైన అంశాలు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 21 ప్రకారం ఏ వ్యక్తి తన జీవితాన్ని లేదా వ్యక్తిగత స్వేచ్ఛను కోల్పోకూడదు. చట్టం ద్వారా నిర్దేశించిన ప్రక్రియ ద్వారా తప్ప మరెప్పుడూ అలా జరగకూడదు. ప్రతి పౌరుడికీ గౌరవంగా జీవించే ప్రాథమిక హక్కు ఉంటుంది. అదే విధంగా సర్వసత్తాక గణతంత్ర దేశంలో ప్రతి పౌరునికీ ఓటు వేసే ప్రాథమిక హక్కు ఉంటుంది. కాబట్టి దానిని జీవించే హక్కుతో సమానంగా పరిగణించాలి. ఓటరు జాబితా నుంచి ఎవరిని తొలగించినా చట్ట నిబంధనల ప్రకారం మొదట సరైన విధానాన్ని అవలంబించాలి. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్లు ఎవరినైనా అనర్హులని ప్రకటిచడం వెనుక పోల్ ప్యానెల్‌లో పనిచేసే అధికారుల ఇష్టాయిష్టాలు, అభిరుచులు మాత్రమే బలీయమైన కారణం కాకూడదు. భారతీయులు ప్రతివారూ ఓటు వేయాలి.ఎందుకంటే అది వారి ప్రాథమిక హక్కు. అంతే తప్ప ఎన్నికల కమిషన్ దయాభిక్ష కాదు. ఈ హక్కు ఒక సౌకర్యవంతమైన దృశ్యం కాదని వాదించ డానికే పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీం కోర్టుకు వ్యక్తిగతంగా హాజరయ్యారు.

బీహార్ తరువాత గత నవంబర్ 4 నుంచి 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)ను చేపట్టిన సంగతి తెలిసిందే. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో కూడా ఇది సాగుతోంది. ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఈ రెండో దశలో కూడా అనేక లోపాలు కనిపిస్తున్నాయని ఆరోపణలు వెల్లువె త్తుతున్నా ఎన్నికల కమిషన్ పట్టించుకోవడం లేదు. ఓటర్ల జాబితా తయారీ అన్నది సమ్మిళిత ప్రక్రియగా ఉండాలి తప్ప ఓటర్లను మి నహాయించేలా ఉండకూడదని సుప్రీం కోర్టు అనేక సార్లు సూచిం చినా ఆ సూచనలను సరిగ్గా పాటించడం లేదు. బీహార్‌లో చాలా ఎక్కువసంఖ్యలో ఓటర్లు తమ హక్కును కోల్పోయే రిస్కును తెచ్చిపె ట్టిందనివిపక్షాలు, వివిధ వర్గాల ప్రజలు తీవ్రంగా ఆందోళన వెలిబు చ్చారు.బీహార్‌లో సాధారణ నివాసులను తొలగించలేదని, వలసవా దులను మాత్రమే టార్గెట్‌గా పెట్టుకు న్నామని ఎన్నికల కమిషన్ నమ్మబలికింది. అయినా ఎక్కువ శాతం మహిళలే జాబితాల్లోంచి తొలగించబడ్డారు. ఈ క్రమ రాహిత్యాలు ఎన్నికల కమిషన్ విధానప రమైన చట్రంలో రూపొందినట్టు కనిపిస్తోంది. పశ్చిమబెంగాల్‌లో కూడా ఇదే కొనసాగడం ఆందోళన కలిగించే విషయం.

## పిపిపి ప్రయోగశాలగా ఆంధ్రప్రదేశ్



రానున్న మూడేళ్లలో రూ. 17 లక్షల కోట్ల పెట్టుబడితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని 852 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రభుత్వ–ప్రైవేట్– భాగస్వామ్యం (పిపిపి) ద్వారా నిర్మించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వాల దగ్గర లేనందున దేశీయ, విదేశీ కార్పొరేట్ కంపెనీల భాగస్వామ్యంతో చేపడుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక వ్యవహారాల విభాగం (డిఇఎ) ప్రకటించింది. ఈ లక్ష్యంతోనే రానున్నకేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు వుండబోతున్నాయి. గతంలో ప్రపం ంచబ్యాంకు వినాశకర విధానాలను అందరికంటే ముందుగా అమలు చేసిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు ఈ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌సిప్ (పిపిపి) లో ముందు వుండేందుకు సిద్ధమయ్యారు. దేశంలోని వివిధ రా(ష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలన్నీ కలిసి 620 ప్రాజెక్టుల్లో ఈ ప్రైవేటీకరణ భాగస్వామ్యాన్ని అమలు చేయడానికి ప్రతిపాదనలు పంపగా, అందులో మన రా(ష్ట్రానికి చెందిన 296 ప్రాజెక్టులున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన రోడ్లను, ఓడరేవులను, విమానాశ్రయాలను, రాజధాని అమరావతిని, చివరికి రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్‌లను కూడా ప్రైవేట్ వారికి అప్పగించడం రా(ష్ట్రాభివృద్ధికి తీవ్ర విఘాతం. పిపిపి విధానం ప్రత్యామ్నాయం కాదు ఇదే పరిష్కారం అని ఆయన అనుకూల మీడియా సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. గతంలో ప్రపంచబ్యాంకు విధానాల అమలులాగే నేడు పిపిపి విధాన ప్రయోగశాలగా మన రాష్ట్రం మారను ంది. ప్రైవేట్ పెట్టుబడుల లాభాల కోసమే పిపిపి: 2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా మారుస్తామని కేంద్ర బిజెపి పాలకులు చాలాకాలంగా చెబుతున్నారు. వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాలు అభివృద్ధి చెంది ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, నాణ్యమైన విద్య, వైద్యం, సామాజిక సేవలు ప్రజలందరికీ అందుబాటులో వుంటే దేశం అభివృద్ధి చెందుతుంది. దేశాభివృద్ధి అంటే జిడిపి పెరుగుదల, సంపన్నుల దగ్గర సంపద పోగుబడడం కాదని, తీవ్రమవుతున్న ఆర్థిక అసమానతల ను తగ్గించడం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం తక్షణం అవసరమని అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థల నివేదికలు చెబుతున్నాయి. కార్పొరేట్ల సేవలో తరిస్తున్న కేంద్రం ఇందుకు భిన్నంగా దేశ ప్రజల సంపదను, ప్రకృతి వనరులను కార్పొరేట్లకు అప్పగిస్తోంది. దానికి పిపిపి అనే ముద్దు పేరు పెట్టింది. ఒకవైపు ప్రపంచ మూడో ఆర్థికవ్య వస్థగా దేశం అభివృద్ధి చెందుతుందంటున్న పాలకులు, మరోవైపు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రైవేట్ పెట్టుబడులే శరణ్యమని చెప్పడం ద్వారా ఎవరిని అభివృద్ధి చేయాలనుకుంటున్నారో అర్థమవుతుంది. ఇప్పటి వరకు నిర్మించిన ప్రాజెక్టులు, విద్యుత్, ఓడరేవులు, విమానాశ్రయాలు, స్టీల్‌ప్లాంట్‌లు, మందుల పరిశ్రమలు ఇలా అనేకం ప్రభుత్వ పెట్టుబడితోనే నిర్మించిన విషయాన్ని కావాలనే బిజెపి పాలకులు మరుగుపరుస్తున్నారు. వీటన్నింటిని ప్రభుత్వమే నిర్మించాలని గతంలో పెట్టుబడిదారులే డిమాండ్ చేశారు. ఆ రోజుల్లో వీటి నిర్మాణానికి అవసరమైన నిధులు ఈ ప్రైవేట్ వారి దగ్గరలేవు.

# ప్రజాసేవే పరమార్థమైన మహో దాత!

చింతలపాటి సీతా రామచంద్ర వరప్రసాద మూర్తిరాజు ప్రముఖ గాం ధేయవాది. స్వాతంత్ర్య సమరయోధులు. వందలాది ఎకరాలు దానం చేసిన దాత...సర్వోదయ ఉద్యమానికి చేయూత...ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక...ఆక్వా పరిశ్రమకు ఆద్యుడు.. విద్యాదాత, అభినవ భోజుడు, గాంధేయవాది, సర్వోదయ నాయకుడు. పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయ ప్రముఖుడు. ఆయన కొల్లేరు రాజుగా గుర్తింపు పొందారు.చిన్ననాటనే రాజకీయాల్లో ప్రవేశించి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక య్యారు. 1952 నుంచి 1982 వరకు తాడేపల్లిగూడెం, ఉ ంగుటూరు, పెంటపాడు నియో జకవర్గాల నుంచి పోటీ చేసి గెలు పొందారు. పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మార్కెటింగు, గిడ్డంగులు, దేవాదాయ శాఖ మంత్రిగా పని చేశారు. ప్రోటెం స్పీకరుగా కూడా పనిచేశారు.మూర్తిరాజు తణుకు తాలూకా సత్యవాడలో 1919వ సంవత్సరం డిసెంబరు 16వ తేదీన . బాపిరాజు, సూరాయమ్మ దంపతులకు జన్మిం చారు. మగపిల్లలు పుట్టలేదని శ్రీరాముడిని వేడుకుంటూ భద్రా చలం శ్రీరాముని దర్శించారు.. భక్తి ప్రపత్తుల ఫలితంగా పుట్టినందున ఈయనకు సీతారామచంద్ర వర ప్రసాద మూర్తిరాజు అని నామ కరణం చేశారు. మూర్తిరాజుగారి బాల్యం కొంతమేర సత్యవాడలోనే గడిచింది. తరువాత నారాయణ పురంలో ఉండేవారు. ఇంటికి సమీపంలో గోదావరి ఏలూరు కాలువ పక్కనే పాకలు వేయించి, వాటిలో వివేకా నంద మాధ్యమిక పాఠశాలను బాపిరాజు తమ స్వంత యాజమాన్యంలో నిర్వహించేవారు. మూర్తిరాజు ఆ పాఠశాలలోనే మాధ్యమిక విద్య పూర్తిచేసారు. ఎనిమిదవ తరగతి వరకు అక్కడే చదివారు. మిడిల్ స్కూల్లో పిల్లలు ఎవరూ చేరలేదు. ఊరూరు తిరిగి,పాఠశాలను నిలబెట్టడానికి బాపిరాజు చాలా శ్రమించారు. ప్రభుత్వ అనుమతిని కూడా తెప్పించారు. తన పక్క గ్రామమైన పెదనింద్ర కొలనులో పార్లమెంటు నమూనాలో గాంధీభవనం నిర్మించి ప్రజల స్మృతి పథం నుంచి మహాత్ముని చెరిగి పోకుండా చేశారు. సర్వోదయ ఉద్యమానికి ఊపిరులూదారు. 1955లో వినోభాబావే భూదానో ద్యమంలో భాగంగా జిల్లాకు వచ్చినప్పుడు 100 ఎకరాల భూమిని దానం చేశారు. 1961లో ఉంగుటూరు మండలం నాచు గుంటలో అఖిల భారత సర్వోదయ సమ్మేళనం నిర్వహంచారు. విద్యా రంగంపై తిరుగులేని ముద్ర: విద్యా రంగంలో మూర్తిరాజు తనదైన ముద్ర వేశారు. భీమవరం, ఏలూరు నగరాలకే పరిమితమైన విద్యను గ్రామీణ ప్రాంతా లకు తీసుకొచ్చిన ఘనత ఆయనదే. తాను ఎస్ఎస్ ఎల్‌సీ వరకు చదివినాచదువు విలువ గుర్తించి ప్రతి ఒక్కరూ విద్యావంతులను చేయాలనే తపన పడేవారు. బాపిరాజు ధర్మసంస్థ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు ఏర్పాటు చేశారు. వాటన్నింటికి దేశ నాయకుల పేర్లు పెట్టారు. కుటుంబంలో మహిళ చదువుకుంటే ఆ ఇల్లంతా విద్యావంతులవుతారనేది ఆయన దృఢ విశ్వాసం. అందుకోసం ఆయన జీవితాంతం కృషి చేశారు. కళల్ని సాహిత్యాన్ని ప్రేమించే మూర్తిరాజు కళాకారులకు ఎందరికో ఉపాధి చూపించారు. భూరి విరాళాలిచ్చి అభినవ భోజుడిగా పేరుపొందారు.. నేడు సినీరంగంలో ప్రముఖ హాస్య నటునిగా కొనసాగుతున్న ఎంఎస్ నారాయణ, పురాణ వ్యాఖ్యాత మైలవరపు శ్రీనివాసరావు ఆయన నెలకొల్పిన పాఠశాలల విద్యార్థులే. ప్రముఖ రచయిత, నటులు పరుచూరి గోపాలకృష్ణ ఆయన స్థాపించిన కళాశాలలో అధ్యాప కులుగా పనిచేశారు. మాజీ మంత్రులు దండు శివరామరాజు, మరో మాజీ మంత్రి కంతేటి సత్యనారాయణ రాజులు ఆయన శిష్యులే. శ్వాసకోశ, గుండె సంబంధ వ్యాధులతో



2012 నవంబర్ 12న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచారు.అందునిమిత్తం 40ఎకరాల భూమిని హామీ ఇవ్వ వలసి వచ్చింది. స్కూల్ లో లక్ష్మీపతి ప్రధానోపా ధ్యాయులుగా, నరసింహాచార్యుల మంచి టీచర్లుగా ఉండేవారు. పాఠాలతోపాటు అనేక విషయాలు చెప్పేవారు. గాంధీ గురించి, ఆయన సిద్ధంతాల గురించి హృదయానికి హత్తుకునేలా చెప్పేవారు. వాస్త వానికి వారివల్ల దేశభక్తి అంటే ఏమిటో,ప్రజాసేవఅంటే ఏమిటొ మూర్తిరా జుకి తెలిసింది.మూర్తిరాజు తన జీవితమంతా ప్రజాసేవకే అంకితం చేశారు. చిన్నతనంలోనే మహాత్మాగాంధీ ప్రభావం ఆయనపై పడి, చివరి వరకు నిజమైన గాంధేయవాదిగానే ఉన్నారు. మహాత్మాగాంధీ దేశ పర్యటనలో భాగంగా 1929లో జిల్లాకు వచ్చినప్పుడు చేబ్రోలు రైల్వేస్టేషనులో ఆయనను చూశారు. అప్పటి నుంచి గాంధీ మార్గంలోనే నడిచారు. గాంధేయ వాదిగా ముద్ర వేసుకొని సత్యం, అహింస, స్వదేశీ విధానాలను తాను ఆచరించడమే కాకుండా జిల్లా వ్యాప్తంగా వాటికి విశేష ప్రచారం కల్పించారు. మాంసా హారానికి దూరంగా ఉ న్నారు. చిన్నతనం నుంచే ఖద్దరు వస్త్రాలను ధరించడం మొదలు పెట్టారు. అనేక మంది రాజకీయనాయకుల సభలకు హాజరయ్యేవారు. బాబూ రాజేంద్రప్రసాద్, జయప్రకాశ్ నారాయణ తణుకు వచ్చినపుడు, టౌన్ హాల్ లో బహిరంగ సభలు జరిగాయి. వారి ఉపన్యాసాలు మూర్తిరాజుని ఎంతగానో ఆకట్టుకోగా స్నేగితులలో కలిసి విద్యార్థి కాంగ్రెస్ ను ఏర్పాటు చేసారు. ఆయనను అధ్యక్షుడుగా ఉండమన్నారు. కార్యదర్శికి బాధ్యత ఎక్కువ కాబట్టి కార్యదర్శి పదవిని ఎంచుకున్నారు. ముళ్ళ పూడి హరిశ్చంద్రప్రసాద్ ను అధ్యక్షుడుగా చేశారు. విద్యార్థి కాంగ్రెస్ లోని వారంతా ఒకే తరగతిలోని విద్యార్థులు.


కొవ్వలి గోపాలరావు, పుసులూరి కోదండ రామయ్య (ప్లీడరు), పొతాప్రగడ శ్రీరామారావు (ప్లీడదు), ముదిగంటి జగ్గన్నా శాస్త్రి మొదలైన నాయకులు తణుకు లోని కోమల విలాస్ దగ్గర గాంధీ బొమ్మ వద్ద సభలు జరిపేవారు. మూర్తిరాజు, స్నేహితులు కలసి సమావేశాలు ఏర్పాట్లు చేసేవారు. మూర్తిరాజు తణుకులో 1934 నుండి 1939 వరకు విద్యాభ్యాసం చేసారు. 1939 మార్చి నెలలో స్కూలు ఫైనల్ పరీక్ష జరగగా, అందులో ఫెయిలయ్యారు. దానితో చదువు మాని స్వగ్రామానికి తిరిగివెళ్ళారు. ఆతర్వాత చదువు కొనసాగిం చడానికి ప్రయత్నించలేదు.

తన పక్క గ్రామమైన పెదనింద్ర కొలనులో పార్లమెంటు నమూనాలో గాంధీభవనం నిర్మించి ప్రజల స్మృతి పథం నుంచి మహాత్ముని చెరిగి పోకుండా చేశారు. సర్వోదయ ఉద్యమానికి ఊపిరులూదారు. 1955లో వినోభాబావే భూదానో ద్యమంలో భాగంగా జిల్లాకు వచ్చినప్పుడు 100 ఎకరాల భూమిని దానం చేశారు. 1961లో ఉంగుటూరు మండలం నాచు గుంటలో అఖిల భారత సర్వోదయ సమ్మేళనం నిర్వహంచారు. విద్యా రంగంపై తిరుగులేని ముద్ర: విద్యా రంగంలో మూర్తిరాజు తనదైన ముద్ర వేశారు. భీమవరం, ఏలూరు నగరాలకే పరిమితమైన విద్యను గ్రామీణ ప్రాంతాలకు తీసుకొచ్చిన ఘనత ఆయనదే. తాను ఎస్ఎస్ ఎల్‌సీ వరకు చదివినా చదువు విలువ గుర్తించి ప్రతి ఒక్కరూ విద్యావంతులను చేయాలనే తపన పడేవారు. బాపిరాజు ధర్మసంస్థ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు ఏర్పాటు చేశారు. వాటన్నింటికి దేశ నాయకుల పేర్లు పెట్టారు. కుటుంబంలో మహిళ చదువుకుంటే ఆ ఇల్లంతా విద్యావంతులవుతా రనేది ఆయన దృఢ విశ్వాసం. అందుకోసం ఆయన జీవితాంతం కృషి చేశారు. కళల్ని సాహిత్యాన్ని ప్రేమించే మూర్తిరాజు కళాకారులకు ఎందరికో ఉపాధి చూపించారు. భూరి విరాళాలిచ్చి అభినవ భోజుడిగా పేరు పొందారు.. నేడు సినీరంగంలో ప్రముఖ హాస్య నటునిగా కొనసా గుతున్న ఎంఎస్ నారాయణ, పురాణ వ్యాఖ్యాత మైలవరపు శ్రీని వాసరావు ఆయన నెలకొల్పిన పాఠశాలల విద్యార్థులే. ప్రముఖ రచయిత, నటులు పరుచూరి గోపాలకృష్ణ ఆయన స్థాపించిన కళాశాలలో అధ్యాప కులుగా పనిచేశారు. మాజీ మంత్రులు దండు శివరామరాజు, మరో మాజీ మంత్రి కంతేటి సత్యనారా యణ రాజులు ఆయన శిష్యులే. శ్వాసకోశ, గుండె సంబంధ వ్యాధులతో 2012 నవంబర్ 12న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచారు.

# నిజాం లొంగుబాటులో కె.ఎం. మున్షీ అసమాన ప్రతిభ



నిజాం కబంధ హస్తాల నుండి హైదరబాదు సంస్థానం విముక్తి పొందడానికి ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ ఉక్కు సంకల్పం గురించి తెలియని తెలంగాణ వారుండరు. తెలంగాణ విమోచన లేదా విలీన ప్రక్రియ వెనక మరో మేధావి, కార్యసాధకుని అకుంఠిత కృషిగురించి చాలా మందికి తెలియదు. ఆయనే కె.ఎం.మున్షీ. బ్రిటీష్‌పాలకులు స్వాతంత్ర్యం ఇచ్చిన సమయంలో.. మూడు సంస్థానాలు ఇండియాలో కలవలేదు. అవి కాశ్మీర్, జునాఘడ్, హైదరాబాద్ (నైజాం). ఆపరిస్థితుల్లో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్... ప్రత్యేక శ్రద్ధపెట్టి...జునాఘడ్ సంస్థానాన్ని భారత్‌లో కలిసేలా చేశారు. నైజాం నవాబ్ మాత్రం విలీనానికి ఒప్పుకోలేదు. అప్పట్లో రాజాకార్ల పేరుతో ప్రత్యేక సైన్యాన్ని తయారుచేసిన ఖాసిం రజ్వీ... మారణకాండకు తెగబడ్డారు. ఈ క్రమంలోనే "ఆపరేషన్ పోలో," పేరుతో నాటి భారత హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ పటేల్ నేతృత్వంలో " పోలీసు చర్య" చేపట్టడం జరిగింది. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, కె.ఎం. మున్షీకి హైదరాబాద్ రాచరిక రాష్ట్రంలో ట్రేడ్ ఏజెంట్ (ఏజెంట్-జనరల్) పదవి ఇవ్వబడింది. హైదరాబాద్‌కు రావడంతో హైదరాబాద్ స్టేట్ రిసెప్షన్ మరియు బోలారమ్‌లోని ఇండియన్ ఆర్మీ యూనిట్ల గౌరవ గార్డుతో ఘనంగా జరిగింది. ఈ సమయం లో నిజాం తన రాష్ట్రాన్ని ఇండియన్ యూనియన్ నుండి స్వతంత్రం గా ఉంచడానికి ప్రయత్నిస్తున్నాడు, సహాయం కోసం కొత్తగా సృష్టించబడిన పాకిస్తాన్ కు రహస్య సంకేతాలను కూడా పంపాడు. ఇటువంటి కుట్రలు భారత యూని యన్‌కు ఎదురయ్యే అనివార్య మైన ప్రమాదాన్ని తెలుసుకున్న డాక్టర్ మున్షీ, నిజాం చేస్తున్న చర్యలగురించి సర్దార్ పటేల్‌కు తెలియ జేసేవారు. భారత గూఢచా ర దళంఅంత పటిష్టంగాలేక. నిజాం సైనిక దళాలను గురించి సరైన అంచనా వేయలేక పోయారు. ఈ పనిని ఏజెంట్ "జనరల్ కే.ఎం. మున్షీ" సుగమం చేశారు. వారు, హైదరా బాద్ సైన్యంలోని ఒక అధికారిని లోబరచుకొన్నారు. అతని ద్వారా హైదరాబాద్ సైన్యపు వివరాలను స్పష్టంగానూ ? ఖచ్చితంగానూ తెలిశాయి. ఈ సమాచారం భారత సైన్యానికి ఎంతో ఉపకరించింది. అంతే కాదు "జే.ఎన్. చౌదరి"కి హైదరాబాద్ సునాయాసంగా జయించగలం అన్న సంపూర్ణ విశ్వాసం ఏర్పడింది. కె.ఎం. మున్షీ స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయవేత్త మరియు భారతీయ విద్యాభవన్ స్థాపకుడు ప్రజాదరణ పొందిన నవలా రచయిత.కన్న యలాల్ మాణిక్ లాల్ మున్షీ డిసెంబరు 30, 1887న ఇప్పటి గుజరాత్ రాష్ట్రంలోని బారుచ్‌లో జన్మించారు. బారుచ్, వడోదరల లో అభ్యసించి జాతీయో ద్యమంలో ప్రవేశించారు. 1937లో బొంబాయి రాష్ట్ర మంత్రిగా పదవి నిర్వహించారు. అంబేద్కర్ అధ్యక్షతన భారత రాజ్యాంగాన్ని రూపొందించిన కమిటీలో సభ్యుని గా మున్షీ డా. అంబేద్కర్‌తో కలిసి 'ప్రాథమిక హక్కుల' సూత్రాన్ని వ్యక్తీకరించిన ముసాయిదాను సంయుక్తంగా రాయడం ద్వారా తన ముద్రను వేశారు. సంస్థానాల విలీనీకరణ సమయంలో మొం డికేసిన హైదరాబాదు నిజాంపై చర్యలు తీసుకోవడానికి భారతప్ర భుత్వ దూతగా వచ్చిన మున్షీ సమస్యనుచక్కగా పరిష్కరించి ప్రసిద్ధి చెందారు. భారత రాజ్యాంగ రచనలో కూడా భాగస్వాము లైనారు. ఆ తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గం లో ఆహార,వ్యవసా య శాఖ మంత్రిగా, ఉత్తరప్రదేశ్ గవర్నరుగా పని చేశారు. చివరి దశలో కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి రాజగోపాల చారితో కల్సి స్వతంత్రపార్టీని స్థాపించారు. సాహితీవేత్తగా రాణిస్తూ భారతీ య విద్యాభవన్‌ను ప్రారంభించారు. 1948 ఫిబ్రవరిలో నిజాం ప్రభుత్వాన్ని హస్తగతం చేసు కోవడానికి ప్రణాళికకు "పోలో" అని నామకరణం చేశారు. హైదరాబాద్ "పోలో" అనే ఒక క్రీడకు ప్రసిద్ధి. అందువల్ల దానికి "పోలో" ఆటలా సైనిక చర్య జరుపుతా మని ఆ పేరు పెట్టారు. 1948 జూలై నెల చివరికంతా "ఆపరేషన్ పోలో" ఏర్పాట్లు? ప్రణాళిక సర్వమూ సిద్ధమ య్యాయి. 22వేల సైన్యానికి 22 రోజులకు సరిపడా ఆహార పదార్థాలు సిద్ధమయ్యా యి. మేజర్ "జనరల్ జయంత్ నాథ్ చౌదరి" ఈ సైనిక చర్య నిర్వహణ కోసం ప్రత్యేకంగా నియమితులయ్యారు. పోలీసు చర్య ఐదు రోజుల్లో ముగిసింది. భారత సైన్యం 10 మంది సైనికులను కోల్పోయింది. 1373 మంది రజాకార్లు హతమయ్యారు. మరో 1911మంది బందీలుగా పట్టుబడ్డారు. హైదరాబాదు సైన్యంలో 807మంది చనిపోగా, 1647 మంది పట్టు బడ్డారు. తాను ఓటమి అంచుల్లో ఉన్నట్లు గమనించి నిజాం నవాబు దిక్కుతోచని స్థితిలో లేక్‌వ్యూ అతిథి గృహంలో బంధించిన భారత ఏజెంట్ మున్షీని కలిసి లొంగిపోతున్నట్లు ప్రకటించాడు. దీనితో ఆపరేషన్ పోలో విజయవంతమైంది. సెప్టెంబర్ 13న జె.ఎన్.చౌదరి నాయకత్వాన ప్రారంభమైన దాడి సెప్టెంబర్ 17న నిజాం నవాబు లొంగిపోవడంతోపూర్తయింది. ఖాసిం రజ్వీఅరెస్టయ్యారు.సెప్టెంబర్ 23న భద్రతాసమితిలో తన ఫిర్యాదును నిజాము ఉపసంహరించు కున్నాడు.హైదరాబాదు భారతదేశంలో విలీనం అయినట్లుగా ప్రకటించాడు. వెర్ని వసూలత్, స్నేహసంభ్రమ, భగ్న పాదుక, తపస్విని ఈనవలలను మన దేశభాషలకే కాక ఇతర దేశ భాషల్లోకి అనువదించారు.కాంగ్రెస్ పార్టీలోసర్దార్ వల్లభాయ్ పటేల్ , మహాత్మగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ లాంటి ప్రముఖుల అభిమానాన్ని చూరగొన్నారు. 1971ఫిబ్రవరి 8న మరణించారు




## జిల్లాల వారీ వృద్ధిలో గజిబిజి

## పునర్విభజనతో సమస్యలు

**అమరావతి,తెలంగాణ దిశ :** జిల్లాల విభజన ప్రభుత్వ వృద్ధి లెక్కలకు ఆటంకంగా మారింది. రాష్ట్ర స్థూల వృద్ధి, జిల్లా స్థూల వృద్ధి లెక్కల్లో సమస్యలు నెలకొంటున్నట్లు సమాచారం. రాష్ట్ర విభజన సమయంలో 13 జిల్లాలు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 28కి చేరిన విషయం తెలిసిందే. ఆ సమయంలోనే మండలాల సంఖ్య కూడా 686 నుండి 688కి చేరింది. ఈ నేపథ్యంలో వృద్ధిని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల స్థాయినుండి గణించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 26 జిల్లాలు ఉన్న సమయంలోనే ఈ విధానానికి బాటలు వేయగా, లెక్కింపులో మాత్రం కొంత ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో వృద్ధిని గణించడంలో క్షేత్ర స్థాయి అధికారులు ఆశించిన ఫలితాలు పొందలేకపోయారని చెబుతున్నారు. వృద్ధి లెక్కింపును జిల్లా స్థాయిలో రంగాలవారీగా కేటాయించడంలో సమస్యలే ప్రస్తుత ఇబ్బందులకు కారణమవుతున్నాయని వారంటున్నారు. తాజా జిల్లాల విభజన ప్రధానంగా పది పాత జిల్లాల పైనే ఎక్కువగా ప్రభావం చూపిస్తున్నాయి. అల్లూరి సీతారాజరాజు, అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలో విభజన అంశాలు సమస్యాత్మకంగా మారుతున్నాయి. 2022లో జిల్లాల్లో ఉన్న మండలాలకు, ఇప్పుడు మారిన జిల్లాల భౌగోళిక పరిస్థితులకు మధ్య అంతరాలు కనిపిస్తున్నాయి. 2022లో అల్లూరి జిల్లాలో 22 మండలాలు ఉండగా, ఇప్పుడు 11 మండలాలే ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లాలోకి 12 మండలాలు చేరుకున్నాయి. కోనసీమ జిల్లాలో కూడా గతంలో 22 మండలాలు ఉండగా, ఇప్పుడు 19 మండలాలు, తూర్పు గోదావరి జిల్లాలో 19 మండలాలు ఉండగా, ఇప్పుడు 22 మండలాలకు, బాపట్లలో 25 నుంచి 20 మండలాలకు, ప్రకాశం జిల్లాలో 39 మండలాలు ఉండగా, ఇప్పుడు 28 మండలాలు ఉండగా, కొత్తగా కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో 21 మండలాలు ఉన్నాయి. ఇక నెల్లూరులో 38 నుంచి 36 మండలాలకు, కడపలో 36 నుంచి 40 మండలాలకు, అన్నమయ్య జిల్లాలో 30 నుంచి 25 మండలాలకు, చిత్తూరు జిల్లాలో 32 నుంచి 28, తిరుపతి జిల్లాలో 34 నుంచి 36 మండలాలుగా భౌగోళిక మార్పులు చోటుచేసుకున్నాయి.

# ఆల్ ఇన్ వన్ స్మార్ట్ కార్డులు



**ఏలూరు,తెలంగాణ దిశ :**పాలనలో సరికొత్త సంస్కరణలు తీసుకువస్తున్న ఏపీ ప్రభుత్వం మరో సరికొత్త ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలోని కోటీ 40 లక్షల కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు అందించాలని నిర్ణయించింది. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కింద ఈ కార్డులను అందించనున్నారు. సోమవారం రోజున జరిగిన సమీక్షా సమావేశంలో స్మార్ట్ ఫ్యామిలీ కార్డులపై అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. జూన్ నాటికి రాష్ట్రంలో స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు పౌరసేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా పాలనాపరంగా పలు సంస్కరణలు తీసుకువస్తోంది. ఈ క్రమంలోనే పాలనలో టెక్నాలజీ వినియోగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే స్మార్ట్ రేషన్ కార్డులు అందించిన ఏపీ ప్రభుత్వం.. ఇప్పుడు మరో స్మార్ట్ ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలోని కోటీ 40 లక్షల కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు అందించాలని ఆలోచన చేస్తోంది. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ సిస్టమ్ ద్వారా వచ్చే జూన్ కల్లా రాష్ట్రంలోని కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.సంజీవని ప్రాజెక్టు, జనాభా నిర్వహణ, పౌష్టికాహారం వంటి అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సంజీవని ప్రాజెక్టు కింద జులై నాటికి రాష్ట్రంలోని 66 లక్షల హైరిస్క్ కేసులకు హెల్త్ స్క్రీనింగ్ చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ క్రమంలోనే ఫ్యామిలీ బెనిఫిట్ కార్డుల గురించి చంద్రబాబు చర్చించారు. జూన్ నాటికి రాష్ట్రంలోని కుటుంబాలకు వీటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు వచ్చే సంవత్సరానికి ఏపీని ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా ప్రకటిస్తామని చంద్రబాబు తెలిపారు.మరోవైపు ఈ ఏడాది జూన్‌లోగా స్మార్ట్ ఫ్యామిలీ కార్డులను ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు పంపిణీ చేయనుంది. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కింద ఈ కార్డులను అందిస్తారు. ప్రతీ కుటుంబాన్ని ఓ యూనిట్ కింద పరిగణిస్తారు. స్మార్ట్ ఫ్యామిలీ కార్డుల మీద ప్రత్యేకంగా ఓ క్యూఆర్ కోడ్ ముద్రిస్తారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ కుటుంబం సమాచారం, వారికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలు, పీ4 అంశాలు వంటివి తెలిసేలా ఈ కార్డులను డిజైన్ చేయనున్నారు.అలాగే ఈ కార్డుల సాయంతో రేషన్ కార్డు సేవలు, ఉపకార వేతనాలు, కులధ్రువీకరణ పత్రాలు, పింఛన్ల వివరాలు, వ్యాక్సినేషన్ వంటి వివరాలను ట్రాక్ చేసేలా ప్రణాళికలు రచిస్తున్నారు. స్మార్ట్ ఫ్యామిలీ కార్డులలో కుటుంబం మొత్తం వివరాలు ఉండటంతో.. సంక్షేమ పథకాల అమలు సమయంలో అర్హులకు లబ్ధి చేకూరనుంది. అలాగే పౌరసేవలు వేగంగా అందుబాటులోకి వస్తాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన వెంటనే కుటుంబం మొత్తం సమాచారం ఉండటంతో పత్రాలను మోసుకెళ్లాల్సిన అవసరం ఉండదు.

# ఏపీలో ఉపాధి పోరు..!



విజయవాడ: ఒకరిది ఉనికి కోసం పోరాటం. మరొకరిది ఆధిప త్యం కోసం ఆరాటం. పేదల కోసం తాము ఎంతో ఆలోచించి తెచ్చిన పథకం రూపురేఖలు మార్చారని కాంగ్రెస్..అప్పటి కంటే ఇంకా గొప్పగా తీర్చిదిద్దామని బీజేపీ ఎవరి వాదన వారిది. ఈ నేపథ్యంలో ఏపీలో ఇంట్రెస్టింగ్‌గా పొలిటికల్ సీన్ కనిపిస్తోంది. ఆఫ్టర్ ఏ లాంగ్ నవ్యాంధ్ర సెంట్రిక్‌గా..జాతీయ పార్టీలైనా.. కాంగ్రెస్, బీజేపీ ఎత్తుకు పైఎత్తు పాలిటిక్స్‌కు తెరలేపాయి.విభజన తర్వాత ఏపీలో డిపాజిట్లు కూడా దక్కించుకోలేని పరిస్థితిల్లో..వెంటిలేటర్ మీద కొనసాగుతోన్న హస్తం పార్టీ..అదును చూసి కమలం పార్టీని కార్నర్ చేసే స్కెచ్ వేస్తోంది. సరిగ్గా ఇదే టైమ్‌లో ఉపాధి హామీ పథకంలో మార్పులు తెస్తూ మోదీ సర్కార్ తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్‌కు అతిపెద్ద అస్త్రంగా మారింది. ఓవైపు పార్లమెంట్‌లో..దేశవ్యాప్తంగా ఎన్డీయే సర్కార్ తీరుకు నిరసనగా విమర్శల దాడి చేస్తూనే ఉంది హస్తం పార్టీ. సేమ్‌టైమ్ గతంలో ఏపీ వేదికగా పురుడు పోసుకున్న ఉపాధి స్కీమ్‌లో..ఇప్పుడు కేంద్రం తెచ్చిన మార్పులను వ్యతిరేకిస్తూ.. రాయలసీమ సెంట్రిక్‌గా అతిపెద్ద ప్రొటెస్ట్‌కు వ్యూహాలు రచిస్తోంది. దీంతో కాంగ్రెస్ స్కెచ్‌కు చెక్ పెట్టేందుకు..ఏపీలోనే హస్తం పార్టీ దూకుడుకు బ్రేకులు వేసేందుకు కమలం పార్టీ వేస్తున్న ప్లాన్స్..పొలిటికల్ హీట్‌ను పెంచుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యూపీఏ సర్కార్-1 హయాంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చింది. 2006 ఫిబ్రవరి నెలలో ఏపీలోని అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలోని బండ్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. అయితే లేటెస్ట్‌గా ఉపాధి హామీ పథకం పేరును జీ రాం జీ స్కీమ్‌గా పేరు మార్చింది కేంద్రఅంతేకాదు ఉపాధి హామీ రూపురేఖలనే మార్చేసింది. మోదీ సర్కార్ నిర్ణయానికి వ్యతిరేకంగా.. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టింది కాంగ్రెస్ పార్టీ. ఏపీ సెంట్రిక్‌గా ప్రారంభమైన పథకంపై..అదే చోట కేంద్రం తీరుకు నిరసనగా..అతిపెద్ద ప్రొటెస్ట్‌కు ప్లాన్ చేస్తోంది. ఫిబ్రవరి 2న అనంతపురం జిల్లా బండ్లపల్లిలో షర్మిల దీక్ష చేయబోతున్నారు.ఈ సభకు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే అటెండ్ వస్తారని అంటున్నారు. ఏఐసీసీ అగ్రనేతలు కనుక ఈ దీక్షకు వస్తే.. దేశవ్యాప్త చర్చకు దారితీయడం ఖాయం. దీంతో కాంగ్రెస్‌కు ధీటుగా బీజేపీ పెద్ద స్కెచ్చే వేసిందట. ఏపీలో కాంగ్రెస్ విమర్శలను చెక్ పెట్టాలని..జీ రాం జీ స్కీమ్‌లో తెచ్చిన మార్పులతో మేలెంత అన్నది వివరించేందుకు రెడీ అయిందిఈ మధ్యే అటల్ బిహారీ వాజ్ పేయ్ శతజయంతి ఉత్సవాల పేరుతో ప్రజల్లోకి వెళ్లారు ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ పీవీఎన్ మాధవ్. ఇప్పుడు ఆయనకు ఇంకో టాస్క్ అప్పగించిందట బీజేపీ అధినాయకత్వం. జీ రాం జీ చట్టంపై..అంటే ఉపాధి హామీ పథకంలో తీసుకొచ్చిన మార్పులతో ఎంత మేలు జరగబోతోందో వివరించేందుకు పీవీఎన్ మాధవ్ యాత్ర చేపట్టబోతున్నారట.ఏపీలోని అన్ని జిల్లాలలో సభలు, సమావేశాలు పెడుతూ కొత్త చట్టం ద్వారా ప్రజలకు ఎంత ఉపయోగం జరగనుంది..గతానికి కంటే ఎక్కువగా కలిగే ప్రయోజనం ఏమిటనేది వివరించాలని చూస్తున్నారట. గతంలో ఉన్న 100 పని దినాలను 125 రోజులకు పెంచడంతో పాటు..పేదలను దృష్టిలో పెట్టుకుని పలు నిర్ణయాలను తీసుకున్నట్లు ఎక్స్‌ప్లెయిన్ చేస్తారట.కేంద్రం జాతీయ ఉపాధి హామీ పథకానికి గండి కొడుతోందని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారానికి ఇక్కడే స్ట్రాంగ్ కౌంటర్ ఇవ్వాలనేది కమలనాథుల వ్యూహంటున్నారు. అందుకే పీవీఎన్ మాధవ్‌తో యాత్రకు శ్రీకారం చుడుతున్నారని..ఈ యాత్రకు కేంద్రమంత్రులు, జాతీయ నేతలను కూడా తరలివచ్చి..కాంగ్రెస్ అలిగేషన్స్‌పై కౌంటర్ ఇవ్వడంతో పాటు..కమలం పార్టీకి ఇంకింత మైలేజ్ తెచ్చే ప్లాన్ చేస్తున్నారట. ఇలా ఉపాధి హామీ పథకంపై..ఏపీ సెంట్రిక్‌గా కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ పొలిటికల్ ఫైట్ ఇంట్రెస్టింగ్‌గా మారేలా కనిపిస్తోంది.

# టీడీపీలో ఫైర్ బ్రాండ్ మహిళా లీడర్లు

**విజయవాడ,తెలంగాణ దిశ :.**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ విజయ పరంపరకు మహిళా నేతలు నేడు అసలైన పిల్లర్లుగా నిలుస్తున్నారు. ముఖ్యంగా రెడ్డప్పగారి మాధవీరెడ్డి, మంత్రి సవిత, హోంమంత్రి వంగలపూడి అనిత, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, మంత్రి సంధ్యారాణి వంటి నేతలు నేడు అసెంబ్లీలోనూ, బయటా తమ గళాన్ని వినిపిస్తూ ప్రత్యర్థులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. వీరిలో కొందరు రాజకీయ వారసత్వంతో వచ్చినా, మరికొందరు సామా న్యులుగా రాజకీయాల్లోకి వచ్చినా.. తమదైన శైలిలో అరాచక శక్తులపై పోరాడుతూ పార్టీలో తిరుగులేని స్థానాన్ని సంపాదించుకున్నారు. రాయలసీమ గడ్డపై భూమా అఖిలప్రియ,గౌరు చరిత రెడ్డి వంటి వారు చూపుతున్న తెగువ రాజకీయాన్ని మరో స్థాయికి తీసుకువెళ్లింది. అరాచక పార్టీగా ముద్రపడిన వైసీపీ నాయకుల బెదిరింపులకు వెరవకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలకు అండగా నిలవడంలో వీరు ముందుంటున్నారు. అలాగే గౌతు శిరీష, యువ నేత బండారు శ్రావణి శ్రీ వంటి వారు తమ వాగ్ధాటితో, కార్యదక్షతతో మెరుస్తున్నారు. వీరంతా కేవలం పదవుల కోసం కాకుండా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్న తీరు టీడీపీని మహిళా పక్షపాత పార్టీగా గట్టిగా నిలబెట్టింది. గత ప్రభుత్వ హయాంలో వీరు ఎదుర్కొన్న వేధింపులు, పెట్టిన అక్రమ కేసులు వీరిని మరింతగా రాటుదేల్చాయే తప్ప ఎక్కడా వెనక్కి తగ్గించలేకపోయా యి.చంద్రబాబు నాయుడు దూరదృష్టితో టీడీపీలో మహిళలకు లభిస్తున్న ప్రాధాన్యత నేడు ఫలితాలను ఇస్తోంది. నారీ శక్తి ని కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా, నిర్ణయాధికారాల్లో భాగస్వాములను చేయడం వల్లే వీరు స్వతంత్రంగా , ధైర్యంగా తమ నిర్ణయాలను వెల్లడించగలుగు తున్నారు. ఈ ఫైర్ బ్రాండ్ మహిళా నేతలు చూపిస్తున్న చురుకుదనం సోషల్ మీడియాలో సైతం సెన్సేషన్ సృష్టిస్తోంది. తమ మీద దాడి జరిగినా, వ్యక్తిత్వ హననానికి పాల్పడినా.. రెట్టింపు వేగంతో కౌంటర్ ఇస్తూ ప్రత్యర్థి పార్టీలకు చుక్కలు చూపిస్తున్నారు.

# మరో అండర్‌పాస్..!

**నెల్లూరు,తెలంగాణ దిశ :** ఏపీలో మరో అండర్‌పాస్ నిర్మాణం దిశగా కీలక ముందడుగు పడింది. నెల్లూరులో కీలకమైన అండర్‌పాస్ నిర్మాణానికి భూసేకరణ చేపట్టారు. ఇప్పటికే ఈ అండర్‌పాస్ నిర్మాణం కోసం రూ. 115 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే అధికారులు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి అన్ని కుదిరితే ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. నెల్లూరుకు ఈ అండర్‌పాస్ కీలకంగా మారనుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల్ని వేగవంతం చేసింది.రోడ్లు, రైల్వే లైన్లు, ఫ్లై ఓవర్లు, ఆర్వోబీలు, అండర్‌పాస్‌లు.. ఇలా ఎన్నో పనులు చేపడుతోంది. తాజాగా నెల్లూరు దగ్గర రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెడుతూ అండర్ పాస్ నిర్మాణానికి సిద్ధమైంది. నెల్లూరు సమీపంలోని చింతారెడ్డిపాళెం వెళ్లే జంక్షన్‌లో అండర్‌పాస్ నిర్మాణం చేయనున్నారు. ఈ అండర్ పాస్‌ను ఏకంగా ఆరు వరుసలు గా నిర్మించనున్నారు. వాస్తవానికి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును గతేడాది నవం బరులో మంజూరు చేసింది. అంతేకాదు టెండర్ల ప్రక్రియను పూర్తి చేయగా.. ప్రస్తుతం భూసేకరణ చేపట్టారు. ఈ పనులు శరవే గంగా పూర్తిచేసి.. ఏప్రిల్ మొదటి వారంలో పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఈ అండర్‌పాస్ పనుల్ని పర్యవేక్షిస్తున్నారు.ఈ అండర్‌పాస్ కోసం మొత్తం రూ. 115.27 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే అండర్‌పాస్ నిర్మాణానికి 3.57 ఎకరాలు భూమిని సేకరించాలని నిర్ణయించారు. ఈ నిధుల్లో రూ. 22 కోట్లు భూసేకరణ కోసం కేటాయించారు. ఈ అండర్‌పాస్ కోసం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి.. వెంటనే అధికారులు పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. అన్నీ కుదిరితే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అండర్‌సాస్ పనులు ప్రారంభించి.. దాదాపు 15 నెలల్లో పూర్తి చేయిస్తామని చెబుతున్నారు అధికారులు. అందుకే భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నారు అధికారులు.ఈ అండర్‌పాస్‌ను చింతారెడ్డిపాళేనికి వెళ్లే మార్గంలో నిర్మిస్తున్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీ జంక్షన్ నుంచి హరనాథపురం చివర కలిసే కృష్ణపట్నం రోడ్డు దగ్గర దాబా వరకు పనులు చేపట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# తిరుమలలో సొంత డెయిరీపై ఆలోచించాలి





**తిరుమల,తెలంగాణ దిశ :** తిరుమల పవిత్రతను కాపాడేందుకు తీసుకునే చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెడితే బాగుంటుంది. ఎందుకంటే దాదపు ఏడాదిన్నరగా తిరుమల లడ్డూ కల్తీ చుట్టూనే రాజకీయాలు నడుస్తు న్నాయి. ఈ విషయంలో సిట్ దర్యాప్తు సాగుతోంది. ప్రత్యేక విచార ణలు చేపట్టారు. మరో ఏకసభ్య కమిటీ వేస్తున్నట్లు సిఎం చంద్రబా బు నాయుడు ప్రకటించారు. ఇక తిరుమల పవిత్రత దెబ్బతినకు ండా, రాజకీయాలకు తావు లేకుండా కఠిన చర్యలకు అసవరమైన నిర్ణయాలు తీసుకోవడంలో దృష్టి పెడితే మంచిది. తిరుమలలో తీసుకునే నిర్ణయాలను ఇప్పుడు ఎవ్వరూ ప్రశ్నించరు. భక్తులకు వసతి పెంచడం, సౌకర్యాలు పెంచడం, శీఘ్రగతిన దర్శనాలు కల్పించడంలో ప్రధాన నిర్ణయాలు జరగాలి. తిరుమలలో సామాన్యులకు సత్వర దర్శనం అన్నది కలగా మారింది. విఐపిల తాకిడి పెరుగుతోంది. స్వామిని దర్శించుకున్న వారే ఇంకా దర్శించుకుంటున్నారు. అలాగే తిరుమలలో ప్లాస్టిక్ నిషేధం జరగాల్సి ఉంది. లడ్డూలను తాటాకు బుట్టల్లో సరఫరా చేస్తామని గతంలో ప్రకటించినా అమల్లోకి రాలేదు. మంచినీటి సమస్యలు రాకుండా చూడాలి. తిరుమలలో సొంత డెయిరీ ఏర్పాటుపై ఆలోచన చేయడం లేదు. ఇకపోతే తెలంగాణ నేతల సిఫార్సులపై విక్ష ఇంకా కొనసాగుతోంది. ఈ విక్ష తొలగిపోవాలి. తెలంగాణ నేతలను చిన్నచూపు చూడడం ద్వారా ప్రభుత్వం ఈ ప్రాంతా ప్రజలను అవమానపరుస్తోంది. తిరుమల కొండల్లో పచ్చదనం పెంచాల్సి ఉంది. అడువుల్లో సామాజిక వనాలు పెరగాలి. ఇవన్నీ వదిలేసి ఇంకా కల్తీ నెయ్యి వ్యవహారంతో టిడిపి కూటమి ఒకవైపు, వైకాపా నేతలు మరో వైపు అన్నట్లుగా విమర్శలు, ప్రతివిమర్శలు చేయడం సరికాదు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో సాగుతున్న రాజకీయ ఘటనలు దిగజారుతున్న రాజకీయ విలువలకు పరా కాష్టగా మారాయి. తిరుపతి లడ్డూ కల్తీపై సుప్రీంకోర్టు జోక్యంతో సిబిఐ ఏర్పాటు చేసిన సిట్ నివేదిక బహిరంగ పరచకుండానే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ స్వంత వ్యాఖ్యానాలతో రాజకీయంగా లబ్ధి పొందే చర్యలకు దిగారు. లడ్డూ ప్రసాదంలో కొవ్వు అంటూ అధికార కూటమి చేసిన ప్రచారానికి ప్రాయశ్చితంగా యజ్ఞాలు, యాగాలు, పూజలకు వైసిపి నాయకులు తెరతీసారు. దీనికి పోటీగా లడ్డు కల్తీ చేసిన వైసిపి నేతలంటూ అనేక జిల్లాల్లో పేరు, ఊరు లేని బ్యానర్లు వెలిశాయి. పరస్పర విమర్శలతో మొదలై, హద్దులు దాటిన వ్యక్తిగత విమర్శలకు చేరి, దాడులకు, గృహ దహనాల వరకు ఆ వివాదం విస్తరించింది. తిరుపతి లడ్డు కోట్ల మంది ప్రజల విశ్వాసంతో ముడిపడిన సున్నితమైన అంశం. తమ విశ్వాసానికి తగ్గట్టుగా ప్రసాదం పవిత్రంగా వుండాలని కోరుకుంటారు. అలాంటి లడ్డూలో ఆవు కొవ్వు, ఇతర జంతువుల కొవ్వుల లాంటివి కలిశాయని ముఖ్యమంత్రి చెప్పడంతో తక్షణం నిజానిజాలు తేల్చి దోషులకు శిక్ష వేసివుంటే ఇంత రచ్చ జరిగి ఉండేది కాదు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హిందూ మతానికి అపచారం జరిగిందంటూ కనకదుర్గమ్మ గుడి మెట్లు కడిగారు. ఇలా కాకుండా నిజాలు నిగ్గుతేల్చి దోషులను కోర్టు ముందు నిలబెట్టి ఉంటే బాగుండేది. అన్నింటికి మించి తిరుమల శ్రీవారు కోట్లకు పడగలెత్తారు. ఆయనకు వందలాది గోవులు కూడా ఉన్నాయి. నిజానికి చిత్తశుద్ధి ఉంటే గోశాలలను విస్తరించి, సొంత డెయిరీ ఏర్పాటు చేసివుంటే పేచీ వచ్చేది కాదు. గోశాలలను పెంచి, డెయిరీ ఏర్పాటు చేస్తే నిరుద్యోగ సమస్యా కొంత తీరుతుంది. నెయ్యి కల్తీ సమస్య ఉత్పన్నం కాదు. కల్తీ తీవ్రమైన ఆరోపణ కాబట్టి సంబంధిత అధికార సంస్థల ద్వారా నేరాన్ని నిరూపించి నిందితులకు శిక్షపడేలా చేయడం ప్రభుత్వ బాధ్యత. అందుకోసం నియమించిన సిట్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలి. నివేదికలో ఏముందో ప్రకటించ కుండానే మరో కమిటీ వేయడంలో అర్థం లేదు. నిజానికి కల్తీ నెయ్యి వ్యవహారం తిరుమల ప్రతిష్టను దెబ్బ తీసేందుకు జరిగిన కుట్ర అనడంలో సందేహం లేదు. హిందూ మతంపై దాడి అని అనడంలోనూ సందేహం లేదు. గతంలో జరిగిన రామతీర్థం, అంతర్వేది, దుర్గ గుడి విగ్రహాల విధ్వంసం, రథాలు కాలిపోవడం లాంటి విషయాల ను ప్రస్తావించి ఇదంతా హిందూ మతాన్ని దెబ్బతీసి నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న కుట్ర అని పవన్ కళ్యాణ్ ఇప్పటికే ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల చర్యలు అంతిమంగా తమ రాజకీయ పబ్బం గడుపుకునేలా తయారయ్యా యి. ఈసమ స్యలనే ఇక ఇంతటితో ముగించాలి. తిరుమల శ్రీవారికి అవసరమైన ఆవునెయ్యిని పొందేందుకు పకడ్బందీగాచర్యలు తీసుకోవాలి. తిరు మలలో డెయిరీ ఏర్పాటు చేస్తే మరీమంచిది. శాశ్వతంగా సమస్య కు పరిష్కారం దక్కగలదు. వేలకోట్లు వృధా చేసే బదులు శ్రీవారికి అవసరమైన నెయ్యి, పాలు, వెన్న, మీగడలను పొందేందుకు ఇదే సరైన సమయం. డబ్బులకు కొదవ లేదు. గోవులకు కొదవ లేదు. చంద్రబాబు హెరిటేజ్ నడిపిన అనుభవంతో తిరులమ శ్రీవారి కోసం ఓ మంచి డెయిరీ ఏర్పాటు చేస్తే మంచిది. సుగంధ ద్రవ్యాలను కూడా కొండపై పండించే అవకాశలను పరిశీలించాలి. పూదోటలను విస్తరించాలి. ఆ దిశగా కూటమి నేతలు ఆలోచనలు చేయాలి. సమర్థులైన అధికారులు, బోర్డు ఛైర్మన్,సభ్యులు, ఉన్న ప్పుడే ఇది సాధ్యం అవుతుంది. రాజకీయ తాబేదార్లకు బోర్డును అప్పగించినంతకాలం ఇది ఇది సాధ్యం కాదు. ఇకపోతే తిరుమల కల్తీవ్యవహారాన్ని కోర్టుల తుది తీర్పుకు వదిలేయాలి.

# స్మార్ట్ డిజిటల్ లాజిస్టిక్ కేంద్రాలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణలో కొత్తగా 12 లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేసేందుకు రేవంత్ సర్కార్ ప్రణాళికలు రచిస్తోంది. రోడ్డు, రైలు, విమాన మార్గాలతో వీటిని కనెక్ట్ చేయనున్నారు. ఈ మేరకు సర్కార్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో డ్రై పోర్టులు, గిడ్డంగులుగా ఏర్పాటు చేసి స్మార్ట్ డిజిటల్ లాజిస్టిక్ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నారు.తెలంగాణను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు రేవంత్ సర్కార్ 'తెలంగాణ రైజింగ్ 2047' నినాదంతో ముందుకెళ్తోంది. అందులో భాగంగా.. రాష్ట్రాన్ని దేశంలోనే ప్రధాన లాజిస్టిక్ హబ్‌గా మార్చే దిశగా భారీ ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా.. తెలంగాణ లాజిస్టిక్ పాలసీ 2.0 సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందుతోంది. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంతో.. రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 12 కొత్త లాజిస్టిక్ పార్కులు , అవసరమైన చోట్ల డ్రై పోర్టులు, అత్యాధునిక గిడ్డంగులను నిర్మించేందుకు రెడీ అవుతున్నారు.ప్రధానంగా పరిశ్రమలను ఆకర్షించడం, ఎగుమతులను ప్రోత్సహించడం, రవాణా ఖర్చులను తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. రోడ్డు, ట్రైన్, విమాన విమాన మార్గాలను కనెక్ట్ చేస్తూ ఒక పకడ్బందీ సరఫరా వ్యవస్థను నిర్మించనున్నారు. వ్యవసాయాధారిత పరిశ్రమలకు, పారిశ్రామిక క్లస్టర్లకు, ఈ-కామర్స్ సంస్థలకు ఈ మాస్టర్‌ప్లాన్ బ్యాక్‌బోన్‌గా నిలవనుంది. పర్యావరణహిత విధానాలు, ఆటోమేషన్ ద్వారా లాజిస్టిక్ రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే మనోహరాబాద్ సమీపంలో మెగా మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే హైదరాబాద్ శివారులోని మంగళపల్లి, బాటసింగారం తరహాలో మరిన్ని పార్కులను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డు మధ్య ఉన్న ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ' (ప్యూర్) జోన్‌గా ప్రభుత్వం గుర్తించింది. ఇక్కడ తయారీ యూనిట్లు, ఎంఎస్ఎంఈ క్లస్టర్లు, లాజిస్టిక్ హబ్‌లను ఏర్పాటు చేయటం ద్వారా గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థలను వేగంగా కనెక్ట్ చేయనున్నారు. దీనివల్ల భారీస్థాయిలో ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా.. సరుకు రవాణాకు అత్యంత అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. అలాగే, ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్టు వరకు ప్రతిపాదించిన 297 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, రైల్వే లైన్,ఈ డ్రై పోర్టులను కనెక్ట్ చేస్తూ రాష్ట్ర ఎగుమతులను ప్రోత్సహించ నున్నారు. ఎయిర్ కార్గో రంగాన్ని కూడా మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే శంషాబాద్ విమానాశ్రయం ఔషధాలు, ఎలక్ట్రానిక్స్ వంటి విలువైన సరుకు రవాణాలో దేశంలోనే ప్రముఖకేంద్రంగా ఉంది.ఈ ఎయిర్ కార్గో సేవలను రోడ్డు, రైలు మార్గాల తో సమన్వయం చేయడం ద్వారా 'మల్టీ-మోడల్ కనెక్టివిటీ'ని సాధించాలని అధికారులుభావిస్తున్నారు. ఈ సమగ్ర లాజిస్టిక్ విధానం అమల్లోకి వస్తే.. తెలంగాణ పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలవటం ఖాయం.

# 21నియోజకవర్గాల్లో అభివృద్ధి సూపర్

## గ్రేడింగ్ లు ఇచ్చిన ప్రభుత్వం

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పనితీరు సూచీలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పరుగులు పెడుతోంది. వివిధ అభివృద్ధి ,సంక్షేమ సూచికల ఆధారంగా 175 నియోజకవర్గాల ర్యాంకింగ్స్ ఇచ్చింది. ప్రభుత్వం నిర్దేశించిన వివిధ అభివృద్ధి సూచికలు , సంక్షేమ పథకాల అమలు, ప్రజల సంతృప్తిని ప్రాతిపదికగా తీసుకుని ప్రకటించిన ఈ ర్యాంకుల్లో మెజారిటీ నియోజకవర్గాలు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. మొత్తం 175 నియోజకవర్గాల్లో 21 నియోజకవర్గాలు ఏప్లస్ (ఎ+) గ్రేడ్ సాధిం చగా, 153 నియోజక వర్గాలు ఏ గ్రేడ్ దక్కించుకున్నాయి. కేవలం ఒకే ఒక నియోజకవర్గం బి గ్రేడ్‌కు పరిమితం కావడం గమనార్హం. వీటిలో 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన 13 నియోజకవర్గాలు రాష్ట్రానికి రోల్ మోడల్స్‌గా నిలిచాయి. రాష్ట్రంలోనే 93 శాతం మార్కులతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నది విజయవాడ పశ్చిమ నియోజకవర్గం. ఎమ్మెల్యే సుజనా చౌదరి మార్క్ అభివృద్ధికి నిదర్శనంగా నిలిచింది. ఇక్కడ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యలు, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, పారిశుద్ధ్య నిర్వహణలో సాధించిన పురోగతి ఈ ర్యాంకు సాధనలో కీలక పాత్ర పోషించాయి. క్షేత్రస్థాయిలో ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడం , విద్యా, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో సుజనా చౌదరి చూపిన చొరవ ఈ నియోజకవ ర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టింది.రెండవ స్థానంలో నిలిచిన గాజువాకకు 92 మార్కులు వచ్చాయి. నియోజకవర్గం పారిశ్రామికాభివృద్ధి , స్థానిక మౌలిక వసతుల కల్పనలో ఆదర్శంగా నిలిచింది. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గంలోని కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడం మరియు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టారు. అలాగే, మూడవ స్థానాన్ని దక్కించుకున్న కాకినాడ నగర నియోజకవర్గం స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల అమలులోనూ, పారదర్శకమైన ప్రజా పంపిణీ వ్యవస్థలోనూ మేటిగా నిలిచింది. డిజిటల్ గవర్నెన్స్‌ను ప్రజలకు చేరువ చేయడంలో ఈ నియోజకవర్గ ప్రజాప్రతినిధుల కృషి స్పష్టంగా కనిపిస్తోంది.అలాగే నాలుగవ స్థానంలో నిలిచిన విజయవాడ తూర్పు నియోజకవర్గం కూడా పారిశు ద్ధ్యం, పౌర సేవలలో అద్భుతమైన స్కోరును సాధించింది. ఈ ర్యాంకింగ్స్ కేవలం అంకెలకు పరిమితం కాకుండా, ఎమ్మెల్యేల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంచడానికి దోహదపడుతున్నాయి. ప్రతి రూపాయి ప్రజల కోసమే ఖర్చు కావాలన్న ప్రభుత్వ సంకల్పం, ఈ ఫలితాల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రతిబింబిస్తోంది. ఏ ప్లస్ నియోజకవర్గాల స్ఫూర్తితో మిగిలిన ప్రాంతాల్లో కూడా పాలనను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# పేద రోగులకు రోబోటిక్ విధానంలో ఫ్రీగా సర్జరీలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** క్యాన్సర్‌వ్యాధితో బాధపడుతున్న పేద రోగులకు ఎంఎన్‌జే ఆసుపత్రిలో ఉచితంగా సర్జరీలు చేస్తున్నారు. రోబోటిక్ విధానంలో రోగులకు ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్స లు చేస్తున్నారు. గత రెండున్నరేళ్లలో ఆసుపత్రిలో రూ.12.5 కోట్ల విలువైన సర్జరీలు చేసినట్లు వైద్యులు వెల్లడించారు.పేద రోగులకు నిజంగా ఇది వరమనే చెప్పాలి. హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో పేద రోగులకు రోబోటిక్ విధానంలో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నారు. అవి కూడా ఉచితంగా. గడిచిన 30 నెలల వ్యవధిలో దాదాపు రూ.12.5 కోట్ల విలువైన రోబోటిక్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సేవలను ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా పేద రోగులకు అందిస్తున్నారు. గత రెండున్నరేళ్లలో రికార్డు స్థాయిలో 250 వరకు రోబోటిక్ సర్జరీలు చేశారు. హైదరాబాద్ నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాలు, సరిహద్దు రాష్ట్రాల నుంచి ప్రతి రోజూ 700-800 వరకు రోగులు క్యాన్సర్ చికిత్సల కోసం ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా చాలామంది రోగులు వస్తుంటారు. సాధారణంగా ఒక రోబో సర్జరీకి ప్రైవేటు ఆసుపత్రిలో అయితే రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం ఎంఎన్‌జేకు ఒక్కో రోబో సర్జరీకి రూ.1.5 లక్షల వరకు చెల్లిస్తోంది.కిడ్నీ, పెద్దపేగు, గ్యాస్ట్రిక్, గర్భసంచి, అన్నవాహిక, ప్రొస్టేట్ క్యాన్సర్లకు గతంలో కోత పెట్టి క్యాన్సర్ గడ్డలను తొలగించే వారు. అయితే అతి చిన్న క్యాన్సర్ గడ్డలను తొలగించడానికి డాక్టర్లకు కొన్నిసార్లు సాధ్యమయ్యేది కాదు. అధిక రక్త స్రావంతో పేషెంట్లు ఎక్కువ రోజులు హాస్పిటల్స్‌లోనే ఉండాల్సి వచ్చేది. ప్రస్తుతం అత్యాధునిక సర్జికల్ రోబోతో అతి చిన్న కణతులను చాలా ఈజీగా తొలగిస్తున్నారు. ఎలాంటి కోత లేకుండానే.. నాలుగు రంధ్రాలతో రోబో చేతులు లోపలకు వెళ్లి క్యాన్సర్ గడ్డలను పూర్తిగా తొలగిస్తున్నాయి.

డాక్టర్లకు చేతులు వణుకు సమస్య ఉంటే ఈ శస్త్రచికిత్సలు చాలా కష్టమయ్యేవి. ప్రస్తుతం రోబోలతో సర్జరీలు చేస్తుండటంతో ఆ పరిస్థితి లేదు. ఇన్‌ఫెక్షన్లకు ఆస్కారం కూడా చాలా తక్కువ. మహిళల్లో వచ్చే గర్భాశయ క్యాన్సర్‌కు రోబోటిక్ సహాయ శస్త్ర చికిత్స మంచి ఫలితాలు అందిస్తోంది.ఇక తెలంగాణలో వైద్యారోగ్యశాఖ బలోపేతానికి సర్కార్ కీలక చర్యలు తీసుకుంటుంది. ఆసుపత్రుల్లో వైద్యులతో పాటు ఇతర సిబ్బంది నియామకానికి ఆదేశాలు ఇచ్చింది. దాంతో పాటుగా కొత్తగా ఆసుపత్రుల నిర్మాణం.. ఇప్పటికే ఉన్న ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేస్తున్నారు. జిల్లాల్లోనూ డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసి కిడ్నీ రోగులకు ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకుంటున్నారు.

# ఔను.. వాళ్లిద్దరూ కలిసిపోయారు



**కడప,తెలంగాణ దిశ :** రాజకీయాలు ఎప్పుడు ఒకేలా ఉండవు. వాటి పరిణామాలు కూడా ఒకేలా ఉండవు. శత్రువులు మిత్రులవుతారు. మిత్రులు రాజకీయం గా శత్రువులుగా మారుతారు. ఈ విషయంలో హేమహే మీలే బాధితులు. అయితే తాజాగా వైయస్ షర్మిల తో ఆయన సోదరుడు జగన్మోహన్ రెడ్డి రాజీ చేసుకున్నట్లు ప్రచారం నడుస్తోంది. త్వరలో వారిద్దరూ రాజకీయంగా ఒకటి కానున్నట్లు టాక్ నడుస్తోంది. అందుకు తగ్గట్టుగానే పరిస్థితులు ఉన్నాయి. ఇటీవల షర్మిల సోదరుడు జగన్ పై విమర్శలు తగ్గించారు. కూటమిపై విమర్శలు పెంచుతున్నారు. అంతకుమించి కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్ తగ్గించారు. దీంతో సోదరుడితో ఆమె చేయి కలుపుతారన్న అనుమానాలకు బలం చేకూరుతోంది. అయితే ఈ విషయంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ఒకప్పటి సన్నిహితులు చొరవ తీసుకున్నట్లు తెలుస్తోంది. రాజశేఖర్ రెడ్డి వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చారు జగన్మోహన్ రెడ్డి. తండ్రి అకాల మరణంతో జగన్మోహన్ రెడ్డికి అండగా నిలిచింది ఆ కు టుంబం. అయితే కుటుంబ, ఆర్థికపరమైన, ఆస్తుల పంపకాలకు సంబంధించిన వివాదంలో సోదరుడిని తీవ్రంగా విభేదించారు షర్మిల. అందుకే తెలంగాణలో తండ్రి పేరుతో రాజకీయాలు చేయాలని చూ శారు. అక్కడ వర్క్ అవుట్ కాకపోయేసరికి ఏపీకి వచ్చారు. రాజకీయం గా ఇబ్బంది పెట్టాలని కూడా చూశారు సోదరుడ్ని. కాంగ్రెస్ పార్టీ పగ్గాలు తీసుకొని 2024ఎన్నికల్లో ఎంతలా డ్యామేజ్ చేయాలో అంతలా చేశారు. చివరకు సొంత జిల్లా కడపలో సైతం రాజశేఖర్ రెడ్డి చరిత్ర మసకబారింది. అయితే రాజకీయాలకు దూరంగా ఉన్న చాలామంది రాజశేఖర్ రెడ్డి సన్నిహితులు ఆ కుటుంబ పరిస్థితిని చూసి ముందుకు వచ్చారు. వారి మధ్య ఉన్న గ్యాప్ ను సరి చేసే పనిలో పడ్డారు. వారి మధ్య జరిగిన చర్చలు విజయవంతం అయినట్లు కూడా తెలుస్తోంది. అందుకే వారు రాజకీయంగా కలిసిపోయేందుకు ముందుకు వచ్చినట్లు సమాచారం.ఏపీ విషయంలో కాంగ్రెస్ హై కమాండ్ ఆలోచన చేయడానికి జగన్ కారణమని తెలుస్తోంది.షర్మిల కాంగ్రెస్ పార్టీ పగ్గాలు వదిలించుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం ఉందట. అయితే షర్మిల ప్రాంతీయ పార్టీ ఏర్పాటు చేస్తారని కూడా ప్రచారం జరిగింది. రాయలసీమ పేరుతో రాజకీయాలు మొదలు పెడతారని కూడా టాక్ నడిచింది. అయితే ఇప్పటికే పార్టీ పెట్టి చేతులు కాల్చుకు న్నారు. మరోసారి ఆ పరిస్థితి తెచ్చుకోకూడదని భావిస్తున్నారు. ఇటువం టి సమయంలోనే రాజకీయాలకు దూరంగా ఉన్న కొంతమంది రాజశేఖ రరెడ్డి సన్నిహితులు రంగంలోకి దిగారు. అటు బెంగళూరులో ఉన్న జగన్మోహ న్ రెడ్డితో.. ఇటు హైదరాబాదులో ఉన్న షర్మిల తో చర్చలు జరిపారట. చాలావరకు సమస్యలకు పరిష్కార మార్గం చూపించారట. అందుకే వారిద్దరూ కలిసిపోయేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది.

# అమరావతికి చట్టబద్ధత..!

**అమరావతి,తెలంగాణ దిశ :**అమరావతి రాజధాని కి చట్టబద్ధతపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ చట్టం చేయనున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఏపీ సీఎం చంద్రబా బు వరుసగా కేంద్ర మంత్రులతో సమావేశాలు కావడం.. టిడిపి తో పాటు కూటమి ఎంపీలకు కీలక సూచనలు చేయడం చూస్తుంటే మాత్రం బిల్లు పార్లమెంట్ లోకి వస్తుందని అర్థమవుతోంది. అయితే ఇప్పుడు ఆ 29 గ్రామాలను మాత్రమే కలిపి అమరావతిగా గుర్తిస్తారా? లేకుంటే పక్కన ఉన్న విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ గుర్తిస్తారా? అన్నది హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటికే అమరావతి అంటే మున్సిపాలిటీ కాదు అని.. అదో మహానగరం గా తీర్చిదిద్దుతా మని చంద్రబాబు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కేంద్రం చట్టబద్ధత కల్పిస్తున్న దృష్ట్యా అమరావతిని మరింత విస్తృతపరచి గుర్తించాల్సిన అవసరం ఉంది. విజయవాడ తో పాటు గుంటూరు నగరాలను కలిపితేనే.. అమరావతి అనేది ఒక అద్భుతమైన నగరంగా ఆవిష్కృతం అయ్యే అవకాశాలు ఉన్నాయి.2014లో రాష్ట్ర విభజన జరిగింది. అందరి అభిప్రాయంతో అమరావతి రాజధానిని ఎంపిక చేశారు చంద్రబాబు. దాదాపు 50 వేల ఎకరాల వరకు సమీకరించి అమరావతి రాజధాని పనులను మొదలుపెట్టారు. ఇంతలోనే అధికార మార్పిడి జరిగింది. వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. దీంతో అమరావతి నిర్వీర్యం అయింది. గత ఐదేళ్లపాటు అమరావతి రైతులు పడరాని పాట్లు పడ్డారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వారికి చుక్కలు చూపించింది. ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో అమరావతికి పునరుజ్జీవం వచ్చింది. అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి కూడా. అయితే ఇప్పటికీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతి రాజధానిపై విషం కక్కుతూనే ఉంది. దీంతో అమరావతికి చట్టబద్ధత తెస్తే కానీ తమకు శాంతి ఉండదని అమరావతి రైతులు కోరుతూ వచ్చారు. అందుకే ఏపీ విషయంలో ప్రత్యేక పరిగణలోకి తీసుకొని



అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చిం ది. అయితే కేవలం 29 పంచాయితీలను మాత్రమే అమరావతిగా గుర్తిస్తే ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఇప్పటికే అదనపు భూసేకరణ చేపడు తున్నారు. చెంతనే విజయవాడ ఉంది. ఆపై గుంటూరు నగరం కూడా ఉంది. కృష్ణా,గుంటూరు, ఎన్టీఆర్ తో పాటు పరిసర జిల్లాల్లో కొన్ని ప్రాంతా లను అమరావతిలో చేర్చితే ఇదో మహానగరంగా, ప్రపంచ స్థాయి నగరంగా గుర్తించబడుతుంది. ఇప్పటికే అమరావతిలో నవ నగరాలు నిర్మించాలన్నది ప్రణాళిక. అందుకు తగ్గట్టు చంద్రబాబు నిర్మాణాలు చేపడుతున్నారు. ఇటువంటి తరుణంలో ఆ 29 పంచాయితీలకే అమరావతిని పరిమితం చేయడం ఎంత మాత్రం సుముఖత కాదు. అయితే అందుకే సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రులతో పాటు ఎంపీలతో సమన్వయం చేసుకుంటున్నారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత విషయంలో సానుకూలతలకు ప్రయత్నిస్తున్నారు. విస్తృత సంప్రదింపులు జరపాలని పార్టీ ఎంపీలకు సూచిస్తున్నారు. మొత్తానికైతే అమరావతి చట్టబద్ధత విషయంలో ఏం జరుగుతుంది అనే దానిపై అంతటా చర్చ నడుస్తోంది.

# సినిమా న్యూస్



# నటాషా స్టాంకోవిక్ పూల్ సైడ్ ట్రీట్

నటాషా స్టాంకోవిక్ పరిచయం అవసరం లేదు. టీమిండియా ఆల్ రౌండర్ హార్ధిక్ పాండ్యా మాజీ భార్య. అతడి నుంచి విడాకులు తీసుకునే క్రమంలో నటాషా పేరు నిరంతరం మీడియా హెడ్ లైన్స్ లో నిలిచింది. ప్రస్తుతం ఈ భామ లో ప్రొఫైల్ మెయింటెయిన్ చేస్తున్నా కానీ, నెటిజనులు పదే పదే వెబ్ లో తన గురించి తరచి తరచి శోధిస్తున్నారు. దీనికి కారణం నటాషా ఇన్‌స్టా మాధ్యమంలో షేర్ చేస్తున్న హాలి ఫోటోషూట్లు. నటాషా సోషల్ మీడియాను హీటెక్కించడం ఇప్పుడే కొత్తేమీ కాదు. హార్దిక్ పాండ్యా నుంచి విడిపోయిన తర్వాత మరింత బోల్డ్ అండ్ బ్యూటిఫుల్ ఫోటోషూట్లతో వార్తల్లో నిలుస్తోంది. తాజా స్విమ్ సూట్ ఫోటోగ్రాఫ్స్ నెట్టింట వైరల్ అవ్వడమే కాకుండా నటిగా సెకండ్ ఇన్నింగ్స్ గురించి ఆసక్తికర చర్చకు తెర తీస్తున్నాయి. నటాషా పూల్‌సైడ్ డిజైనర్ స్విమ్ సూట్‌లో అదిరిపోయే ట్రీటిస్తోంది. పూల్ లో అలా ప్రశాంతంగా నిలబడి గట్టున ఉన్న ఫ్రూట్ సలాడ్ ని సేవించేందుకు నటాషా రెడీ అవుతోంది. అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణానికి తగ్గట్టు తన చిరునవ్వు కూడా హృదయాలను గెలుచుకుంది. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా దూసుకెళుతోంది. మోడలింగ్ లో బిజీ.. నటాషా మోడలింగ్ అసైన్ మెంట్స్ కి వస్తే, ప్రస్తుతం ఈ విదేశీ భామ -బ్యూటీ అండ్ వెల్నెస్- బ్రాండ్లకు ప్రాధాన్యత ఇస్తోంది. ఫిబ్రవరి 2026లో ఇన్‌సైట్ కాస్మెటిక్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా నటాషా ఒక భారీ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. టాక్సిక్-ఫ్రీ బ్యూటీ థీమ్‌తో సాగే ప్రకటనల్లో మెరుస్తోంది. అద్భుతమైన ఫిట్‌నెస్ తో అందరి దృష్టిని ఆకర్షించే నటాషా, పలు ప్రీమియం జిమ్ వేర్, ఫ్యాషన్ లేబుల్స్ కలెక్షన్స్ కి మోడలింగ్ చేస్తోంది. అబూజానీ సందీప్ ఖోస్లా డిజైనర్ సంస్థకు నటాషా మోడలింగ్ చేస్తోంది. తిరిగి నటనలోకి.. చాలా విరామం తర్వాత నటాషా తిరిగి వెండితెరపై కనిపించేందుకు సిద్ధమవుతోందని కూడా కథనాలొస్తున్నాయి. ఒక ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ కోసం వెబ్ సిరీస్‌లో నటించేందుకు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. గతేడాది ఫ్యాషన్ ఈవెంట్లలో పాల్గొన్నప్పుడు, మంచి స్క్రిప్ట్ వస్తే వెబ్



సిరీస్‌లలో నటించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని నటాషా స్వయంగా వెల్లడించారు. ఆ తర్వాత అవకాశం వెతుక్కుంటూ వచ్చింది. బాలీవుడ్‌లో -డిజె వాలే బాబు- వంటి సూపర్ హిట్ సాంగ్‌లో నటాషా నర్తించింది. దీంతో కొన్ని భారీ చిత్రాల్లో ఆమె స్పెషల్ డ్యాన్స్ నంబర్స్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. కొడుకు కోసం త్యాగం.. నటాషా తదుపరి వెబ్ సిరీస్ లలో నటించేందుకు సంసిద్ధంగా ఉంది. కెరీర్‌లో డ్యాన్సర్‌గా కంటే నటిగా గుర్తింపు తెచ్చుకోవాలని ఆశిస్తోంది. హార్దిక్ పాండ్యాతో విడిపోయిన తర్వాత నటాషా తన కొడుకు అగస్త్యతో కలిసి ముంబైలో ఉంటూనే, కెరీర్‌పై పూర్తి ఫోకస్ పెట్టింది. తన ఇన్‌స్టా ద్వారా కేవలం గ్లామరస్ ఫోటోషూట్లను షేర్ చేయడమే కాకుండా, ఫిట్‌నెస్, సెల్ఫ్-లవ్ గురించి సందేశాలు ఇస్తూ మహిళా అభిమానులను ఆకట్టుకుంటోంది.

# ఎరుపులో దిశా పటానీ కళాత్మక భంగిమలు



బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ వరుస ఫోటోషూట్లు వెబ్ లో సునామీ సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. నిమిషాల్లోనే లక్షలాదిగా ఫాలోవర్స్ దిశా ప్రతి పోస్ట్ కి స్పందిస్తుంటారు. ఈసారి కూడా అదే రెస్పాన్స్. లోఫర్ బ్యూటీ తన అద్భుతమైన ఫోటోషూట్లతో ఇంటర్నెట్‌లో మరోసారి సెన్సేషన్ సృష్టించింది. ఈసారి ఎరుపు రంగు డిజైనర్ దుస్తుల్లో తాజా ఫోటోషూట్ ని పోస్ట్ చేసింది. తాజా ఫోటోలు అభిమానులను కట్టిపడేస్తున్నాయి. ముఖ్యంగా ఎరుపు రంగు ఫ్లోరల్ టాప్, హాఫ్ షోల్డర్ లుక్‌తో మతులు చెడగొడుతోంది. ఇక ఈ టాప్ ని కవర్ చేస్తూ, ఒకఎరుపు రంగు కాంబినేషన్ చీరను దిశా ఆసరాగా చుట్టుకుని కనిపించింది. ఇక మెడలో కాంబినేషన్ కెంపులు, రత్నాలు పొదిగిన బంగారు ఆభరణాన్ని ధరించింది. దీనికి తెల్లని ముత్యాల అల్లిక అదనపు ఆకర్షణగా మారింది. దిశా అందాన్ని పదింతలు ఎక్కువగా ఎలివేట్ చేసింది ఈ హారం. ఎంపిక చేసుకున్న కాస్ట్యూమ్ కి తగ్గట్టే దిశా ఫోజులు కూడా వేడి పుట్టిస్తున్నాయి. ప్రస్తుతం ఈ యూనిక్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా దూసుకెళుతోంది. పంజాబీ గాయకుడితో ప్రేమాయణం? గత కొంతకాలంగా దిశా పటానీ, ప్రముఖ పంజాబీ గాయకుడు తల్వీందర్ ఒకరితో ఒకరు ప్రేమలో ఉన్నారంటూ బాలీవుడ్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే డేటింగ్ నిజమేనా? అని ప్రశ్నిస్తే, ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తల్వీందర్ ఈ రూమర్లపై స్పందించారు. తామిద్దరం ప్రస్తుతం ఒకరినొకరు అర్థం చేసుకునే ప్రక్రియలో ఉన్నామని, ఇప్పుడే ఏమీ చెప్పలేనని పేర్కొన్నారు. ప్రతిరోజూ ప్రేమలో పడుతుంటాను.. ప్రస్తుతం కూడా ప్రేమలో ఉన్నాను! అని హింట్ ఇచ్చేసాడు. దీంతో దిశా పటానీతో అతడు ప్రేమలో ఉన్నానని అంగీకరించినట్టేనని అభిమానులు భావిస్తున్నారు. ఇటీవల కృతి సనన్ సోదరి నుపూర్ సనన్ వివాహ వేడుకలో దిశా- తల్వీందర్ జంటగా కనిపించారు. అంతేకాకుండా, ముంబైలో జరిగిన పలు ఈవెంట్లలో చేతులు పట్టుకుని నడుస్తూ కెమెరా కంటికి చిక్కారు. ఇప్పటివరకు దిశా దీనిపై అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. దిశా ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉంది. షాహిద్ కపూర్ సరసన దిశా పటానీ ఓ రోమియో అనే చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా ఫిబ్రవరి 13న విడుదల కానుంది. ఇందులో -జూలీ- అనే పాత్రలో దిశా కనిపించనుంది. చాలా కాలంగా చిత్రీకరణ లేక ఆలస్యమైపోయిన వెల్ కం టు ది జంగిల్ (వెల్ కం ఫ్రాంఛైజీ చిత్రం) త్వరలో రావాల్సి ఉంది. ఇది భారీ మల్టీస్టారర్. అలాగే ఆవారాపన్ 2 సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. అలాగే దిశా పటానీ హాలీవుడ్ లో ప్రవేశిస్తోందని గుసగుసలు వినిపిస్తున్నాయి. హోలిగార్డ్స్ సాగా- ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్ అనే ఇంగ్లీష్ సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో మెరవబోతోంది. కల్కి 2898 ఏడి తర్వాత టాలీవుడ్ లో దిశా తదుపరి సినిమా గురించి ఇంకా వివరాలు వెల్లడి కాలేదు. తమిళంలోను కంగువ తర్వాత తన ప్రాజెక్ట్ గురించి ఎలాంటి ప్రకటనలు లేవు.


# బెడ్డింగ్ టైమ్.. నైటీలో అందాలు ఆరబోస్తున్న శాన్వీ!



పాపులారిటీని సంపాదించుకోవడానికి సెలబ్రిటీలు ఇంస్టాగ్రామ్ ను వేదికగా చేసుకుంటున్న విషయం అందరికీ తెలిసిందే..కొంతమంది ప్రత్యేకంగా రెడీ అయ్యి ఫోటోషూట్ నిర్వహిస్తుంటే.. మరి కొంతమంది తమ అందంతో ఆకట్టుకునేందుకు గ్లామర్ వలకబోస్తే చాలు ప్రదేశంతో పనిలేదు అని నిరూపిస్తున్నారు. ఇటీవల ఒక హీరోయిన్ ఏకంగా బాత్రూం నుండి కొన్ని ఫోటోలు షేర్ చేస్తే.. ఇప్పుడు మరో హీరోయిన్ ఏకంగా బెడ్ నుండి ఫోటోలు పంచుకోవడం వైరల్ గా మారింది. అందులోనూ నైటీ ధరించి మరీ అందాలు ఆరబోయడంతో ఇది చూసిన నెటిజన్స్ ఇదో ట్రెండీ ఫోటో షూట్ అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఆమె ఎవరో కాదు అందాల తార శాన్వీ శ్రీ వాస్తవ. 1992 డిసెంబర్ 8న ఉత్తరప్రదేశ్ వారణాసిలో జన్మించిన శాన్వి అసలు పేరు శాంభవి శ్రీ వాత్సవ. ఇండస్ట్రీలోకి వచ్చిన తర్వాత తన పేరును మార్చుకుంది. ఈమెకు ఒక అన్నయ్య, అక్క కూడా ఉన్నారు. అక్క విదిషా శ్రీ వాత్సవ. ఈమె కూడా ఒక నటే . శాన్వి ముంబైలోని ఠాకూర్ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ కామర్స్ లో డిగ్రీ పూర్తి చేసిన ఈమె.. ముంబైలో ఎంబీఏ పూర్తి చేసింది. 2012లో సాయికుమార్ వారసుడు ఆది సాయికుమార్ హీరోగా నటించిన లవ్లీ అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె తన రెండవ తెలుగు చిత్రం అడ్డా సినిమాలో ఒక ఫ్యాషన్ డిజైనింగ్ స్టూడెంట్ గా కనిపించి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇక తర్వాత హారర్ కామెడీ బ్యాక్ గ్రౌండ్ లో వచ్చిన చంద్రలేఖ సినిమాతో కన్నడలో అరంగేట్రం చేసింది ఈ ముద్దుగుమ్మ. ఇక తర్వాత తెలుగులో రౌడీ , ప్యార్ మే పడిపోయానే వంటి చిత్రాలలో నటించింది. ఆ తర్వాత కన్నడ ,మలయాళం, మరాఠీ చిత్రాలలో నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె.. ఇప్పుడు సడన్గా సోషల్ మీడియాలో దర్శనమిచ్చి అభిమానులను ఆకట్టుకుంది. ఇట్స్ బెడ్డింగ్ టైం అంటూ బెడ్ మీద నుంచే అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. దుప్పటిని హత్తుకొని శాన్వి షేర్ చేసిన ఫోటోలకు అభిమానులు ఫిదా అవుతున్నారు. ఇదో ట్రెండీ ఫోటోషూట్ అంటూ కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికి అయితే శాన్వి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా.. అమ్మడిలో ఏ మాత్రం మార్పు రాలేదు. మళ్లీ హీరోయిన్గా అవకాశాలు అందుకోవాలి అంటూ కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం కన్నడ, మరాఠీ భాషలలో ఫోకస్ పెట్టిన ఈమె త్వరలోనే తెలుగులో మంచి అవకాశం అందుకొని రీఎంట్రీ ఇవ్వాలని కూడా అభిమానులు కోరుకుంటున్నారు. మరి ఫ్యాన్స్ కోరిక మేరకు శాన్వీ పాత్రకు తగ్గట్టుగా బలమైన క్యారెక్టర్ ఎవరు ఇస్తారో చూడాలి.

# ట్రాన్స్పరెంట్ అందాలతో హొయలుపోతున్న సంయుక్త!

ప్రముఖ హీరోయిన్ సంయుక్త గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అమాయకంగా కనిపిస్తూనే.. తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. తొలిసారి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, రానా కాంబినేషన్లో వచ్చిన 'భీమ్లా నాయక్' సినిమాలో రానా భార్య పాత్రలో నటించి ఆకట్టుకుంది. క్లైమాక్స్ లో సన్నివేశాలు ప్రేక్షకుల చేత కంటతడి కూడా తెప్పిస్తాయి. అలా తన అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న సంయుక్త మీనన్.. 2016లోనే 'పాప్ కార్న్' అనే మళయాల చిత్రం ద్వారా హీరోయిన్గా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. ఇక ఒక్కో భాషా చిత్రంలో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తూ వచ్చిన ఈమె తెలుగు, తమిళ్ , కన్నడ, మలయాళం భాషల్లో నటిస్తూ మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది. ఒకవైపు సినిమాలు చేస్తూనే మరొకవైపు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటోంది సంయుక్త మీనన్. ఈ మధ్యకాలంలో రోజుకొక గ్లామర్ ఫోటో షూట్ తో అభిమానులను ఆకట్టుకుంటుంది. అందులో భాగంగానే తాజాగా ట్రాన్స్పరెంట్ దుస్తులు ధరించి తన అందాలతో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అందులో కొంటెగా ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరుకి అభిమానులు సైతం ఫిదా అవుతున్నారు. అంతేకాదు ఈమె ఈ ఫోటోలను షేర్ చేస్తూ.."కొంచెం సాఫ్ట్.. కొంచెం హాట్" అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ప్రస్తుతం సంయుక్త మీనన్



షేర్ చేసిన ఈ ఫోటోలకు అటు నెటిజన్స్ కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215